నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
మంగళవారం | 20 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

రూ.30లక్షల విలువ గల విద్యుత్ వైరు చోరీ

నవతెలంగాణ-కొండపాక



విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ శివారులోని రాజీవ్ రహదారి పక్కనే ఉన్న రెండు వెంచర్లలోని విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అప హరించుకెళ్లారు. రాజీవ్ రహదారి పక్కనే ఉన్న 18 ఎకరాల విస్తీర్ణంలోని ఒక వెంచర్‌లో సుమా రు 70 విద్యుత్ స్తంభాలు, మరో వెంచర్‌లో 10 విద్యుత్ స్తంభాలతో విద్యుత్ సౌకర్యం కోసం విద్యుత్ వైర్‌ను ఏర్పాటు చేసి దీపాలను అమ ర్చారు. కాగా, నాలుగు రోజుల నుంచి విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో వెళ్లి చూసేసరికి విషయం బయటపడింది. సుమారు రూ.30 లక్షల విలువ ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాగా, విద్యుత్ సం ఘరా అవుతున్న వైర్లను కట్ చేసి తీసుకుపోవడంతో తెలిసిన వారు చేశారా అనే అనుమానాలు వెంచర్‌లోని ప్లాట్ల యజమానులు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహకు సన్మానం

నవతెలంగాణ-జోగిపేట



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహనుఅందోల్ మండల పరిధిలోని డాకూర్ గ్రామ మాజీ సర్పంచ్ కలాలి పూజా రమేష్ గౌడ్ ఆధ్వ ర్యంలో సోమవారం ఘనంగా సన్మాని ంచారు. మొదటిసారి మంత్రి హెూదాలో డాకూర్ గ్రామానికి వచ్చిన సందర్భంగా మాజీ సర్పంచ్ స్వగృహంలో శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సంద ర్భంగా గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్సాన్‌పల్లి పీఏసీఎస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి, గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ అజయ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



చేపలు అమ్ముకోవడానికి అనుమతులు ఇవ్వండి

నవతెలంగాణ-మెదక్

మెదక్ జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్లో చుట్టుపక్కల గ్రామాల మత్స్య కార్మికులను చేపలు అమ్ముకోవడానికి అనుమతి ఇవ్వాలని మత్స్య కార్మిక సంఘం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. మల్లేశం మత్స్య కార్మిక సంఘం నాయకులు హనుమంతు, శీను కోరారు. ఈ మేరకు సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహించి అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మానేగల రాములుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మెదక్ జిల్లా కేంద్రంలో ఉన్న మత్స్య కార్మిక సంఘం సభ్యులు తైభాజార్ పేరుతో 100 కు పది రూపాయల చొప్పున అక్రమ వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె లు కలుస్తేనే జిల్లాగా ఏర్పాటు అయిందని గుర్తుచేశారు. గ్రామాల్లో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని కూరగాయల సరుకులు, చేపలు, మేకలు, గొర్రెలు ఇతర ఉత్ప త్తులు పప్పు ధాన్యాల లాంటి ప్రజలకు అవసరపడే నిత్యజీవితంలో వాడుకునే ఉత్ప త్తులను గ్రామాల నుంచి తీసుకొచ్చి జిల్లా కేంద్రంలో అమ్ముకుంటారన్నారు. జిల్లా కేంద్రంలో చుట్టుపక్కల గ్రామాల రైతులు ఉత్పత్తి చేస్తున్న చేపలు అమ్ముకునే అధి కారం అందరికీ ఉంటదన్నారు. మున్సిపల్ అధికారులు తైబజార్ వసూలు చేసి చాపలు మార్కెట్లో అమ్ముకునే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ జిల్లా కేంద్రంలో చేపలు అమ్ముకునే హక్కులు కల్పించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజు, రాములు, సాయిలు, గంగయ్య, శ్రీకాంత్, మానెమ్మ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ కోసం..

పార్ట్‌టైమ్ స్వీపర్ల ఎదురుచూపులు

- పదేండ్లు అధికారంలో ఉన్నా పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ-నంగునూరు

ఏండ్ల తరబడి వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్ల పర్మినెంట్ ఆశలు అడియాసలే అవుతున్నాయి. ఉపాధ్యాయులతో సమానంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేస్తున్నప్పటికీ చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారు. 27 ఏండ్ల నుంచి పనిచేస్తున్నప్పటికీ తమను పర్మినెంట్ చేయడం లేదని తమకిచ్చే జీతం రూ.5200 మాత్రమేనని, దాంతో తమ కుటుంబాలు ఎలా బతకాలని పార్ట్‌టైమ్ స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి తమ సమస్యలను విన్నవించినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమ సమస్యలను పరిష్కరించి, ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయాలని కోరుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారు 300 మంది పార్ట్ టైం స్వీపర్లు (పీటీఎస్‌లు) ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 165 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 27 ఏండ్ల కింద పార్ట్‌టైమ్ స్వీపర్ల ఉద్యోగం.. మొదట రూ.50 జీతంతో ప్రారంభమై.. ఏడాదికి రూ.100 పెంచుతూ రూ.1000 వరకు వచ్చింది. దాంతో పలుమార్లు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రూ.1500 వరకు పెరగింది. అనంతరం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయకుండా నెల వేతనాన్ని రూ.4000లకు పెంచారు. ఇవి కూడా ఏ మాత్రం సరిపోవడం లేదంటూ పలుమార్లు పోరాటాలు చేయడంతో పాటు మంత్రుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. రెండవసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. రూ.4000 నుంచి రూ.5200 వారి జీతాలను పెంచింది. కానీ ఉద్యోగాలను పర్మినెంట్ చేయలేదు. పార్ట్ టైం స్వీప ర్లను పర్మినెంట్ చేస్తున్నామని రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. దాంతో ఏదో ఒక రోజు పర్మినెంట్ చేస్తారన్న ఆశతో వేచి చూస్తూ పాఠశాలల్లో పని చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే వేతనం సరిపడక వారి పిల్లలను ఏదో రకం పనులకు పంపిస్తున్నారు. చాలావరకు వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్లు వికలాంగులే ఉన్నారు. ఉద యం నుంచి సాయంత్రం వరకు పాఠశాలల్లో అటెండర్ పనులు సైతం మీరే చేస్తున్నారు. వీరి పిల్లలు చాలావరకు పదో తరగతిలోపే చదివిన వారు



ఉన్నారు. ఉన్నత చదువులు చదివించ లేక ఇబ్బందులు పడుతున్నామని పార్ట్ టైం స్వీపర్ల డివిజన్ నాయ కులు కట్కూరి యాదగిరి, జంగిటి రాములు వెల్లడించారు. కాంగ్రెస్ చేపట్టిన భారత్ జోడో యాత్రలోనూ ఆ నాయ కులకు వినతి పత్రాలు అందించినట్టు తెలిపారు. అధికారంలోకి రాగానే మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని స్వీపర్లు తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకొని తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



మండలానికో బీసీ ఫంక్షన్ హాల్ నిర్మించాలి

-మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేసిన బీసీ నేతలు

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బీసీ ఫంక్షన్ హాళ్ల నిర్మించాలని హుస్నాబాద్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గం కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ పట్టణంలో బీసీ భవన్, ఫంక్షన్ హాల్, స్టడీ సర్కిల్ భవనం ఏర్పాటు కోసం రెండు ఎకరాల భూమి, రూ.5 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. పట్టణ కల్లు గీత కార్మిక సంఘంకు 5 గంటల భూమి, రూ.20 లక్షల నిధులు కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్టు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో.. తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, హుస్నాబాద్ మండలం యూత్ అధ్యక్షులు గట్టు సాయి గౌడ్, నాయకులు దుద్దెడ రాజేష్, పెరుమాండ్ల భరత్, వేణు తదితరులు ఉన్నారు.



అంగన్వాడీల పెండింగ్ వేతనాలను చెల్లించాలి..

నవతెలంగాణ-మెదక్

అంగన్వాడీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం, కార్యదర్శి నర్సమ్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షాకు అంగన్వాడీ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగులకు డిసెంబర్, జనవరి రెండు నెలల వేతనాలు చెల్లించకపోతే కుటుంబ పోషణ ఎలా నడుస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామాల్లో తల్లులకు, గర్భవతులకు, పిల్లలకు పోషకాహారం అందించే వారికి వేతనాలు చెల్లించకపోతే ఎలా బతుకుతారన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందు బాటులో ఉండి సేవలు అందించే వారికే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించక పోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు వేతనాలు చెల్లించి మెదక్ జిల్లాకు చెల్లించక పోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-కొండాపూర్

అంబేద్కర్ ఆశయాలను, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడానికి అందరూ కృషి చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, పంబాల దుర్గాప్రసాద్, కార్యదర్శులు ప్రవీణ్ సంచుల, గారకుర్తి ప్రవీణ్ కుమార్‌లు అన్నారు. కొండాపూర్ మండలంలో సోమవారం ఆ సంఘం సమావేశం నిర్వహించి.. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పంబాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న దురాచారాలపై పోరాడాలని, ప్రజా సమస్యల పరిష్కారానికై పనిచేయాలని కోరారు. కాగా మండల నూతన అధ్యక్షుడిగా జె.మోహన్ రాజు, ప్రధాన కార్యదర్శిగా జె.రవికుమార్, ఉపాధ్యక్షులుగా వి.సత్యానందం,ఎర్రోళ్ల రవి, బి.నవీన్, అధికార ప్రతినిధిగా టీ.ప్రభుదాస్, కార్యదర్శులుగా, కే.రవీందర్, డి.కిషోర్‌లను ఏకగ్రీవముగా ఎన్నుకున్నారు. ఆ సంఘం కోఆర్డినేటర్ ఎస్ వరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు సి.వినయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు పంబాల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు.

కలెక్టర్ అవుదామని.. మంత్రిని అయ్యాను

- జేఎన్‌టీయూలో విద్యార్థులతో మంత్రి దామోదర ముఖాముఖి
- రూ.4.30 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- అందోల్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం

నవతెలంగాణ-జోగిపేట

తాను కలెక్టర్ కావాలనుకుని అనుకున్నానని.. కానీ రాజకీయాల్లోకి వచ్చి మంత్రిని అయ్యానని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. తాను సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాన.. అయితే తన తండ్రి మరణానంతరం రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందన్నారు. అందోల్, చౌటకూరు మండలాల్లో సోమవారం వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సుల్తాన్‌పూర్‌లో జేఎన్‌టీయూను ఏర్పాటు చేశానన్నారు. ఆడిటోరియం, స్టేడియం, గెస్ట్‌హౌస్, క్లాక్‌టవర్‌లకు నిధులను మంజూరు చేయించి రెండేళ్లలో పూర్తి చేయిం చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. విద్యార్థులు ఈ విద్యతో పాటు సామాజిక బాధ్యత పెంచుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ.. తాను బీటెక్ చదవి, సివిల్స్ ప్రిపేర్ అయ్యానని, కలెక్టర్‌గా



ఎంపికయ్యాయనన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదవి ఉన్నత స్థానాల్లో ఉండాలని సూచించారు.

రూ.4.30 కోట్ల పనులకు శంకుస్థాపన..

అందోలు, చౌటకూర్ మండలాల్లో రూ.4.30 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. చౌటకూర్ మండలంలోని న్యూవాన్నాపురం వద్ద జనరల్ పాలిటెక్నిక్ కళాశాల కంపౌండ్ వాల్ కోసం రూ.1.41 కోట్లు, సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ప్రహరీగోడ నిర్మాణానికి రూ.1.43 కోట్లు, ఎన్ఆర్ఈజీఎస్ కింద జేఎన్‌టీయూలో సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.78 లక్షలు, అందోలు మండలం సంగపేట వద్దనున్న అగ్రికల్చర్ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీగోడకు రూ.48 లక్షలు, సీసీ రోడ్ల కోసం రూ.20 లక్షలు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. ఆయా పనులకు సంబంధించిన ఆయన శంకుస్థాపనలు చేశారు.

ప్రిన్సిపాల్‌పై మంత్రి ఆగ్రహం..

సంగుపేట వ్యవసాయ మహిళ పాలిటెక్నిక్ కళాశాల పరిసరాలు అస్తవ్యస్తంగా ఉండడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ స్పందనపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ప్రాంగ ణంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం, అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థినీలకు రక్షణను ఏలా కల్పిస్తారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి మహిళ అగ్రికల్చర్ కళాశాలను తాను మంత్రిగా ఉన్న సమయంలో తీసు కొచ్చానని, కళాశాల కోసం జాతీయ రహదారి పక్కనే 25 ఎకరాల స్థలాన్ని కేటాయించానన్నారు. కానీ కళాశాల నిర్వహణ చూస్తుంటే తనకే సిగ్గుగా అనిపిస్తుదంటూ అసహనం వ్యక్తం చేశారు. తాను మళ్లీ వచ్చేసరికి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని లేదంటే చర్యలుంటాయని హెచ్చరించారు. కళాశాల మెయిన్ గేట్ జాతీయ రహదారి వైపు ఉండేలా ప్రహరీ నిర్మాణం చేపట్టాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం విద్యార్థిణులతో మాట్లాడి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలుపగా, మైదానన్ని చదును చేయించాలని విద్యార్థిణులు కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కట్ట నర్సింహరెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ నర్సింహ, ఆర్‌డీవో పాండు, ఏడీఏ అరుణ, ఏవో విజయ రత్న, మున్సిపల్ కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, ఎ.చిట్టిబాబు, రేఖా ప్రవీణ్, హరికృష్ణాగౌడ్, అగ్రికల్చర్ కళశాల ప్రిన్సిపాల్ స్పందన, ఎంపీడీవో రాజేష్ తదితరులు ఉన్నారు.



కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉమ్మడి మెదక్ జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని, సంగారెడ్డి జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.నవీన్‌చంద్రని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలో దరఖాస్తు చేసుకుని ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న టీఎఫ్‌టీ లైసెన్సులను వెంటనే మంజూరు చేయాలన్నారు. అర్హులైన గీత కార్మికులందరికీ సొసైటీలలో కొత్త సభ్యత్వాలు మంజూరు చేసి అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గ్రామాలలో అక్రమంగా నడుస్తున్న మద్యం బెల్టు షాపులను అరికట్టి.. కల్లుగీత కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా నాయకులు రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కుమార్ గౌడ్ కృష్ణ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, అంజన్న గౌడ్ చేన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని సామాజిక తరగతులకు కేసీఆర్ పెద్దపీట



నవతెలంగాణ-గజ్వేల్

గత ప్రభుత్వంలో అన్ని సామాజిక తరగతులకు కేసీఆర్ పెద్దపీట వేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ దేవాలయ ఉత్సవాలు, బీరప్ప దేవాలయ ఉత్సవాల్లో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అన్ని సామాజిక తరగతులకు ఆత్మ గౌరవ భవనాలను నిర్మించడమే కాకుండా కొలుస్తున్న దేవాలయాల అభివృద్ధికి కృషి చేసినట్టు గుర్తు చేశారు. రాష్ట్రంలోనే బీరప్ప ఉత్సవాలను గజ్వేల్ ప్రాంతంలో ఉత్సాహంగా నిర్వహించుకుంటారన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలోనూ మూడు నాలుగు రోజులుగా పట్టణంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు రాజు, గాలి అనిల్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జాకీర్, జేడ్పీటీసీ మల్లేశం, కౌన్సిలర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు జమ చేయాలి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

దళిత బందు సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ముందు దళిత బందు సాధన దీక్ష జరిగింది. ఇందులో దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోగిల మహేశ్ గారు పాల్గొని మాట్లాడుతూ ' రెండవ విడత దళిత బందు నిధులను లబ్దిదారుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని' అన్నారు. గత ప్రభుత్వంలో 2 విడత లబ్ధిదారులకు 10 లక్షల చొప్పున మంజూరు అయ్యాయని అన్నారు . మొత్తాన్ని ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో ఖాతాలను బ్లాక్ చేయడం జరిగిందని, కోడ్ ముగిసి 3 నెలలు కావస్తున్నా మొత్తాన్ని లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయటంలో జాప్యం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దళిత బందు పథకం కింద 1000 కోట్లు మంజూరు చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతూ వాటిని లబ్దిదారుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని కోరారు. అనంతరం జిల్లా అదనపు పాలనాధికారి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్



చిట్టిమళ్ళ సమ్మయ్య,రాష్ట్ర నాయకులు చిన్ని క్రిష్ణ, మగికొండ రమేష్, దళిత బందు సాధన సమితి సభ్యులు బోనగిరి శ్రీనివాస్, దీటి బాలనర్సు, వడ్లూరీ పరుశురాములు,ఎలుక దేవయ్య, జేరిపోతు తిరుపతి, వంకాయల నరేశ్, కొంపెల్లి బాబు, పబ్బతి శంకర్, బిగుళ్ల మోహన్,మంకల నగేష్, బిగల్ల సుదర్శన్,లింగాల అర్జున్, బామండ్ల లక్ష్మణ్, బెజ్జంకి శంకరయ్య, పొట్లపెల్లి శివక్రిష్ణ, జంగిటి శంకర్, బెజ్జంకి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ నియంత్రణ-మహిళల ఆరోగ్యం' కార్యక్రమంపై కేంద్రం అభినందనలు



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

సిద్దిపేట జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 'ప్లాస్టిక్ నియంత్రణ, మహిళల ఆరోగ్యం'పై వినూత్నంగా నిర్వహించిన స్టీల్ బ్యాంక్ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం అభినందించింది. ఈ నెల 16,17 తేదీల్లో కేంద్ర తాగునీరు, పారిశుధ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించిన "జల జీవన్ - స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ)" కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఈ జాతీయ సదస్సులో జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ స్టీల్ బ్యాంక్ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో గ్రామీణ స్థాయిలో మహిళల ఆరోగ్యంపై ముఖ్యంగా రుతుక్రమ నిర్వహణ, ప్యాడ్‌ల వాడకం వంటి వాటిపై నిర్వహించిన కార్యక్రమాలు మహిళల ఆరోగ్య మెరుగుదలకు ఉపయోగపడ్డాయని తెలిపారు. ప్యాడ్స్ వాడకం తగ్గించి రుతుక్రమ కప్పుల వినియోగాన్ని పెంచడం ద్వారా ప్లాస్టిక్ నియంత్రణకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని గ్రామాలు సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా మరి ఆరోగ్య గ్రామాలుగా రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాలు, యువత, విద్యార్థుల సహాయంతో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల నుంచి రాష్ట్రస్థాయి కమిషనర్లు, ఎంపిక చేయబడిన జిల్లాల కలెక్టర్లతో పాటు తెలంగాణ నుంచి పంచాయతీరాజ్ కమిషనర్, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



పేదింటి పెండ్లికి 'మన సమాజం ఫౌండేషన్' చేయూత

నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన పేదింటి ఆడపడుచు వివాహానికి 'మన సమాజం ఫౌండేషన్' చేయూతగా నిలిచింది. ఇదే గ్రామంలో 15 రోజుల క్రితం ఓ పేదింటి అమ్మాయి వివాహానికి ఈ ఫౌండేషన్ పుస్తెమెట్టెలు అందజేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అదే గ్రామానికి చెందిన ఓ పేద కుటుంబం కర్ణాటక ప్రాంతంలో నివాసముంటూ కూలీ పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నది. అయితే ఆ కుటుంబానికి చెందిన అమ్మాయి పెండ్లికి కూడా ఆసరాగా నిలవాలని ఆ అమ్మాయి తల్లిదండ్రులు మన సమాజం ఫౌండేషన్‌ను సంప్రదించారు. దాంతో వారు వెంటనే స్పందించి ఆ ఆడపడుచు వివాహానికి పుస్తెమెట్టెలు, చీర అందజేసినట్టు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మహేష్ స్వామి, నిర్వాహకులు చరణ్‌కుమార్ తెలిపారు. అడిగిన వెంటనే సాయం అందించిన ఫౌండేషన్ సభ్యులందరికీ ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. సమాజంలో మనం కూడా ఓ భాగం కావాలన్న గొప్ప సంకల్పంతో ఒక వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి.. దానిని రిజిస్టర్ చేయించి అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు 54 వివాహాలకు పుస్తె మెట్టలు, చీర, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, రాత పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లు తదితర సేవా కార్యక్రమాలు చేసినట్టు చెప్పారు. అందరి సహకారంతో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మన సమాజం ఫౌండేషన్ నిర్వాహకులు యాదగిరి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న న్యాల్కల్ ఎంపీడీఓకు ఘన వీడ్కోలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్కల్ మండల ఎంపీడీఓ వెంటక్‌రెడ్డి బదిలీపై నల్గొండ జిల్లాకు వెళ్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం, పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు ఆయనుకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ముందుకు ఎంపీడీఓను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. వెంటక్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి.. వారి మన్ననలు పొందారన్నారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో మండల అధికారులు ఇన్చార్జి ఎంపీడీఓ సురేష్, ఏపీఓ రంగారావు, సాబేర్ హుస్సేన్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్య



క్షుడు మామిడిగీ జగన్నాథ్‌రెడ్డి సెక్రటరీలు నాగభూషణం, రవీందర్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు నీలం మధు ఆపన్నహస్తం

- తల్లీదండ్రులని కోల్పోయిన ముగ్గురు పిల్లలకి అండగా..
- ఒక్కొక్కరికి రూ.50 వేల ఫిక్స్ డిపాజిట్, ప్రస్తుత ఖర్చులకు మరో రూ.50 వేలు
- భవిష్యత్తులో సైతం అండగా ఉంటా : నీలం మధు ముదిరాజ్

నవతెలంగాణ-గజ్వేల్

ఏడాది సంవత్సరం వ్యవధిలో తల్లి దండ్రులను కోల్పోయి దిక్కు తోచని స్థితిలో ఉన్న ముగ్గురు చిన్నారులకు కాంగ్రెస్ రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్ అండగా నిలబడి ఏడాది వ్యవధిలో తల్లిదండ్రులకు కోల్పోయి అనాథలైన ముగ్గురు పిల్లలకు ఆర్థిక సాయం చేయడంతో పాటు అండగా ఉంటానని కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. సోమవారం గజ్వేల్ మండలం కొల్గూర్‌లో చిన్నారులను పరామర్శించి అండగా ఉంటానని ఆపన్న హస్తం అందించారు. కోల్గూరు గ్రామానికి చెందిన నీరుడి భాస్కర్ డ్రైవర్‌గా పనిచేస్తూ మరొక పక్క సొంత మాస్కురిగా పనిచేసేవారు. అయితే ఏడాదిన్నర కితం అనారోగ్యంతో మరణించారు. భాస్కర్‌కు భార్య కవితతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. భాస్కర్ మరణించడంతో పిల్లలకు కవిత అన్ని తానై వ్యవహరిస్తూ మాస్కురిగా ఉద్యోగం చేస్తూ పిల్లల్ని పోషించుకుంది. కాగా, ఆమె సైతం తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసింది. దాంతో వారి ముగ్గురు పిల్లలు కావ్య(6), శ్రీ వాణి(4), కుమార్(18 నెలలు) అనాథలై రోడ్డున పడ్డారు. కవిత కుటుంబ సభ్యుల ఆర్థిక



పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో పిల్లల పోషణ ఇబ్బందిగా మారింది. ముగ్గురు పిల్లలు అనాథలై తీవ్ర కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న విషయం తెలిసిన నీలం మధు పరిస్థితి విని చలించిపోయారు. ఆ పిల్లలకు అండగా నిలబడాలని నిర్ణయించుకుని ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ముగ్గురికి కలిపి రూ.1.50లక్షలు పిల్లల పేర్ల మాద ఫిక్స్ డిపాజిట్ చేశారు. అంతే కాకుండా పిల్లల బాగోగులు చూసుకోవడానికి తక్షణ ఖర్చుల కింద మరో రూ.50వేలు అందించి తన ఉదారతను చాటుకున్నారు. భవిష్యత్తులో సైతం పిల్లల చదువుల కోసం తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అమ్మ నాన్నలను కోల్పోయి బిక్కుబిక్కు మంటున్న పిల్లలకు నీలం మధు అండగా నిలబడి ఆర్థిక సహాయం అందించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మలం రాజు, ఎంపీటీసీ స్వామి, శ్రీను, రోటెల శ్రీను, డా॥సత్యానారాయణ, రావుల రాజు, కనకయ్య, నర్సింలు, మన్నే వెంకటయ్య, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
2
మంగళవారం | 20 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ నియోజక వర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్దిదారులకు 283 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా కల్యాణ లక్ష్మి చెక్‌లను పంపిణీ చేస్తున్న దన్నారు. గత ప్రభుత్వం కొందరికి మాత్రమే చెక్‌లు ఇచ్చిందని..కానీ తమ ప్రభుత్వ అలా కాకుండా అర్హులందరికీ పథకాలను అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్, అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జోగిపేట కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్



నవతెలంగాణ-జోగిపేట

సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జోగిపేట కాంగ్రెస్ పార్టీ నాయకుడు పట్లోళ్ల శ్రీనివాస్ ఆదివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్యేకంగా తయారు చేయించిన రేవంత్‌రెడ్డి ఫోటో, సచివాలయం ఫోటోలతో కూడిన చిత్రపటాన్ని సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నట్టు చెప్పారు. కాగా తనకు జన్మదిన శుభాకాంక్షలు కూడా తెలిపారని.. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీఎం సూచించారని శ్రీనివాస్ తెలిపారు.



బీసీ కాలనీలో బోర్లు వేయించాలని కలెక్టర్‌కి వినతి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

వేసవి దృష్ట్యా బొల్లారంలోని బీసీ కాలనీలో బోర్లు వేయించాలని రెండో వార్డు కౌన్సిలర్ గోపాలమ్మ వెంకటయ్య ప్రజావాణిలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. రానున్న వేసవి దృష్ట్యా జియాలజిస్టుతో సర్వే చేయించి మున్సిపల్ సాధారణ నిధులతో బోర్లు వేయించాలని కోరారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్, చైర్మెన్ అస్సలు పట్టించుకోవడం లేదని.. దాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కి విన్నవించినట్టు కౌన్సిలర్ తెలిపారు.



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన ప్రసాద్ చౌహాన్ సోమవారం సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. ప్రధానంగా డంపింగ్ యార్డు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ ఇంతియాజ్, కౌన్సిలర్ శ్రీకాంత్, నాయకులు నక్క నాగరాజు గౌడ్, గోవర్ధన్ నాయక్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు, బోర్ మోటార్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మండలంలోని నర్సాపూర్ గ్రామంలో బోర్ మోటార్, సీసీరోడ్డును ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీటీసీ పందరి రెడ్డి, మాజీ సర్పంచ్‌మారుతీ, సాయిలు, జైపాల్, శేఖర్, పండరి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



గ్రామకంఠం భూములు కాపాడండి..

నవతెలంగాణ-హత్నూర

గ్రామకంఠం భూములను కాపాడాలని హత్నూర మండలం సాదులనగర్ గ్రామస్తులు ఎంపీడీవో శంకర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కర్రే కృష్ణ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన గ్రామకంఠం పరిధిలోని భూముల్లో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ప్రత్యేక అధికారికి, కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకునే పాపాన పోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా చొరవ తీసుకొని అక్రమ నిర్మాణాలను హారికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పొందుపరిచినట్టు వారు తెలిపారు. వారివెంట కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, రాజు, మల్లేశం, శేఖర్ గౌడ్ తదితరులున్నారు.



బార్బర్ షాప్ ప్రారంభోత్సవంలో సీఐ

నవతెలంగాణ-హత్నూర

మండలంలోని దౌల్తాబాద్(కాసాల) పరిధిలో కాసాల గ్రామానికి చెందిన మంగలి శ్రీనివాస్ నూతనంగా ఏర్పాటు చేసిన బార్బర్ షాపును జిన్నారం సీఐ సుధీర్ కుమార్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ సుధీర్ కుమార్, ఎస్సైలు సుభాష్, మహేశ్వర్ రెడ్డిలు ఈ షాపు పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ దుకాణం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొన్యాల సతీష్, వీరేశం, లింగయ్య తదితరులుపాల్గొన్నారు.



రిపోర్టర్ ప్రవీణ్‌ను పరామర్శించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని మీర్ఖాన్‌పేట గ్రామానికి చెందిన నవతెలంగాణ రిపోర్టర్ ప్రవీణ్ తండ్రి నీరుడి ఇమ్మయ్య గత శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కల్హేర్ జెడ్పీటీసీ నరసింహారెడ్డి సోమవారం వారి ఇంటికి వెళ్లి ప్రవీణ్‌ను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యాన్ని అందించారు. ఆయనతోపాటు రాపర్తి సర్పంచ్ శ్రావణ్, పార్టీ మండల ఉపాధ్యక్షులు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు యాకోబ్, ఉపసర్పంచ్ కుమారుడు రాజు, మాజీ వార్డ్ మెంబర్ ముప్పిడి సాయిలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తోడ్పాటు
- అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి
- అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల

నవతెలంగాణ-అమీన్‌పూర్

మౌలిక వసతుల కల్పనకు మున్సిపాల్టీ బడ్జెట్‌లో పెద్దపీట వేశామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మెన్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సం బంధించి పురపాలిక ప్రత్యేక వార్షిక బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఏర్పడిన నాలుగేండ్లలోనే కౌన్సిలర్లు అమీన్‌పూర్ అభివృద్ధికి పూర్తి సహాయ సహకా రాలు అందిస్తున్నారన్నారు. కౌన్సిలర్లు తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా కౌన్సిల్ తోడ్పాటు నందిస్తున్నదన్నారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ అభి. వృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పురపాలక చట్టం 2019ని అను సరించి సెక్షన్ 107, 108 ప్రకారం పురపాలక బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ఆదాయ, వ్యయాలకు సంబంధించి బడ్జెట్‌లో పొందుపరిచామని కౌన్సిల్ సమావేశంలో తెలిపారు.



బడ్జెట్ కేటాయింపులు ఇలా..

2024-2025 ఆర్థిక సంవత్సరానికి అమీన్‌పూర్ పురపాలక వార్షిక సాధారణ అంచనా బడ్జెట్ మొత్తం రూ.5578.30 లక్షలుగా నిర్ణయించారు. అందులో పన్నురాబడి నుంచి రూ.2800.00 లక్షలు, పన్నేతర రాబడి క్రింద రూ.2778.30 లక్షలతో పాటు 2023-2024 ఆర్థిక సంవత్సరాంతానికి మిగులు బడ్జెట్ రూ.60.71 లక్షలు గా అంచనా వేశారు. ఇందులో పౌరుగు సేవల ఉద్యోగుల జీత భత్యాలకు రూ. 900.00 లక్షలు, పారిశుధ్య నిర్వహణ ఖర్చులకు రూ.535.00 లక్షలు, కరెంటు బిల్లులకు రూ.90.00 లక్షలు, ఋణ వాయిదాల చెల్లింపులకు రూ.30.00 లక్షలు, 10 శాతం నిధులను హరితహారం (గ్రీన్ బడ్జెట్) పనులకు రూ.557.80 లక్షలుగా పేర్కొన్నారు. ఇదే సమయంలో చార్జ్‌డ్ వ్యయాలకు మొత్తం రూ. 2112.80 లక్షలుగా కేటాయించారు. దీంతోపాటు ఇతర నిర్వహణ ఖర్చులకు రూ. 487.10 లక్షలుగా కేటాయించారు. ఇవేగాక రూ. 992.83 లక్షలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాలు, మైనారిటీ ప్రజలు నివసించే ప్రాంతాలు, మురికి వాడల్లో మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. మిగిలిన పురపాలక సంఘ నిధులను పార్కులు, వైకుంఠ ధామాల అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణము, సమీకృత సంతల అభివృద్ధి, జంతువధ శాలల నిర్మాణము, శాస్త్రీయ పద్ధతిలో డంపు యార్డుల నిర్వహణకు, వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు రూ.1930.00 లక్షలు, ఇతర మూలధన వ్యయాలకు కేటాయింపులు చేశారు. రూ. 60.71 లక్షలను అంచనా మిగులుగా చూపించారు. అదే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంటుల రూపంలో రూ. 369.91 లక్షలుగా వచ్చేందుకు అంచనా వేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్, వార్డు సభ్యులు, డీఈఈ వెంకటరమణ, మున్సిపల్ ఏఈ ప్రవీణ్, మున్సిపల్ ఆర్ఓ ఈ వెంకటరామయ్య, అకౌంటెంట్ రాజు, విద్యుత్ ఏఈలు వెంకటరమణ,మణికంఠ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అదనపు బస్సులు నడపాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అదనపు బస్సులు నడిపించాలని టీఎస్ ఆర్టీసీ మెదక్ రీజియన్ మేనేజర్‌కు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల పెరిగిన రద్దీ నివారణకు, మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు వేయడం వల్ల జిల్లాలో బస్సుల కొరత ఏర్పడిందన్నారు. జిల్లాలో ప్రధాన మార్గాలైన సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు జహీరాబాద్, నర్సాపూర్ రూట్‌లలో ప్రయాణం చేసే విద్యార్థులు, ఉద్యోగస్తులు, ఇతర ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నార న్నారు.ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగస్తుల కోసం అదనపు బస్సులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర, టీజేఎస్ యువజన సమితి అధ్యక్షులు డి.పాండు, సామాజిక కార్యకర్త మల్లికార్జున్, ఎంఎస్ఆర్ సోషల్ మీడియా రాజు, మారుకుంది తదితరులు పాల్గొన్నారు.

హత్నూర పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-హత్నూర

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ప్రజావాణి సందర్భంగా డీఎంహెచ్ఓ గాయత్రిదేవికి వినతి పత్రం అందజేసినట్టు సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బి.వి.శివశంకర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకప్పుడు జిల్లాలోనే ఉత్తమ ఆసుపత్రిగా పేషంట్లకు సేవలందించిందని.. కానీ ప్రస్తుతం నిరూపయోగంగా మారుతున్నదన్నారు. చుట్టుపక్కన గ్రామాల నుంచి ప్రతి రోజు 150 నుంచి 200 వరకు ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు అందుకుం టారన్నారు. అయితే అత్యవసర చికిత్స కోసం నలుగురు పర్మినెంట్ స్టాఫ్ నర్సులు అవసరం ఉంటే.. ఇక్కడ ఒక్కరు కూడా లేరని వాపోయారు. డెలివరీ కోసం వచ్చే బీద కుటుంబాలు.. ఆసుపత్రిలో సరైన స్టాఫ్ లేక ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లి బిల్లులు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. కాబట్టి పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని వెంటనే నలుగురు శాశ్వత స్టాఫ్ నర్సులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డెలివరీ కోసం ఆపరేషన్ యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆసుపత్రిలో నీటి కొరత తీవ్రంగా ఉండడంతో పేషెంట్స్ చాలా అవస్థలు పడుతున్నారన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ఆసుపత్రిలోని సమస్యలన్నింటినీ తొందరగా పరిష్క రించాలని డీఎంహెచ్ఓతోపాటు జిల్లా కలెక్టర్ క్రాంతి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి వినతి పత్రాలను అందజేశారు.

సకల రుగ్మతలకు విరుగుడు 'పుస్తకం'

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- 'గోరక్‌పూర్ ఆసుపత్రి ఘోర విషాదం' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-సంగారెడ్డి

మనిషిలోని సకల రుగ్మతలకు విరుగుడు పుస్తకమే అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పక్కన నవ తెలంగాణ పబ్లికేషన్స్ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సోమవారం సందర్శించారు. ఈనెల 12న ప్రారంభమైన ఈ ప్రదర్శన 25వ తారీఖు వరకు కొనసాగుతుందని నిర్వాహకుడు సతీష్ తెలిపారు. పుస్తక ప్రదర్శనను సందర్శించి సాహిత్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు, పిల్లలు పెద్దలు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. బుక్ హౌస్ మేనేజర్ సతీష్‌ని ప్రత్యేకంగా అభినందించారు. 'గోరక్ పూర్ ఆసుపత్రి ఘోర విషాదం' అన్న పుస్తకాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ చక్రపాణి, సీనియర్ జర్నలిస్ట్ పి.వి.రావు, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, నాగరాజులతో కలసి ఎమ్మెల్యే ఆవిష్క రించారు.ఈ కార్యక్రమంలో నాగరాజ్ గౌడ్ , జీవి శ్రీనివాస్ , శ్రీధర్‌రెడ్డి,గోవర్ధన్ నాయక్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



శివాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు...















నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను ప్రతీ ఒక్కరు ముందుకు తీసుకు పోవాలని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. నారాయణఖేడ్ పట్టణ ంలో శివాజీ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీమండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు : ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం మన అందరికీ ఓ స్ఫూర్తిదాయకం, ప్రేరణ అని గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు అన్నారు. హైదరాబాద్ లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శివాజీ 394వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహి ంచారు. ప్రాంగణంలో నెలకొల్పిన శివాజీ మహరాజ్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ, గొప్ప పరిపాలకుడిగా, ఉదార పౌర పాలన స్థాపకుడిగా కీర్తిని పొందారని చెప్పారు. ఆయన గాథలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఎన్ఎస్ఎస్, స్టూడెంట్ లైఫ్ సమన్వయకర్తలు, పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఈ జయంతి వేడుకలలో పాల్గొని శివాజీ మహారాజ్ కు ఘన నివాళి అర్పించారు. ఆయన విజయగాథలను స్మరించుకున్నారు.

కొండాపూర్ : మండలంలోని గంగారంలో యువకులు ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ.. భావితరాలకు మహనీయుల చరిత్ర తెలుసుకోవడం ఎంతో అవసరం ఉందని, విద్యావంతులు మహనీయుల చరిత్ర తెలియజేయాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలకు నిస్వార్థ సేవలను అందించిన మహనీయుడు ఛత్రపతి అన్నారు. శివాజీ మహారాజ్ పరిపాలన విధానాలు వ్యక్తిత్వం నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, నాగేందర్, రాజు, నషీర్, ఆంజనేయులు, శ్రీకాంత్, భాస్కర్, అంబేద్కర్, శేఖర్, వంశీ, ప్రణీత్, లక్ష్మణ్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : మండలంలోని ఖలీల్‌పూర్, మిర్జాపూర్ (బి) గ్రామాల్లో శివాజీ మహారాజ్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా యువకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు.

మునిపల్లి : మండలంలోని మేళాసంఘం, కంకోల్, లింగంపల్లి, పెద్ద చెల్మెడ, గ్రామాలలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె నగేష్, మేళాసంఘం శివాజీ యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, తీన్మార్ మల్లన్న రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. సాధారణ వ్యక్తులను అసాధారణ వీరులుగా తీర్చిదిద్ది వారిలో పోరాట స్ఫూర్తిని దేశభక్తిని నింపిన అసమాన స్వాభిమానా చక్రవర్తి ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల శివాజీ యూత్ సంఘ సభ్యులు, ప్రభు, గొల్ల రమేష్, పడమటి శివ,నగేష్, తుల్జారాం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం : జిన్నారం - పెద్దమ్మ గూడెం చౌరస్తా వద్దగల ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మరాఠాయోధుడి 394వ జన్మదినం సందర్భంగా భారతదేశ చరిత్రలో శివాజీ పరిపాలన దార్శనికమైనదని వక్తలు కొనియాడారు. అనంతరం జిన్నారం వరకు భారీ బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని యువత చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి యూత్ అధ్యక్షులు సత్య నారాయణ యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు ప్రతాపరెడ్డి, హిందూ ధర్మ ప్రచార సమితి జిన్నారం మండల కన్వీనర్ వడ్ల ఆనంద్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మేంద్ర గౌడ్, మహేందర్ గౌడ్, జగన్ రెడ్డి, నరేష్, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డు వద్ద నిమ్మరసం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల్, మధు, గణేష్, సాయి, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-కంది

మండలంలోని మామిడిపల్లి తాండాలో గల ఎంపీపీఎస్ పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యా యులుగా మారి తోటి ఉపాధ్యా యులకు భోదించారు. కాగా ప్రధా నోపాధ్యాయులుగా సుశాంత్, ఉపా ధ్యాయులుగా నందిని, స్రవంతి, అద్విత, మీనాక్షి, అక్షిత, అర్చన అభిలాష్ విద్యార్థులు వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాములు జగన్మోహన్, స్వప్నకుమారి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-న్యాల్‌కల్

హద్నూర్ 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా రేపు(బుధవారం) మండల పరిధిలోని హద్నూర్, చల్కి, న్యాల్‌కల్, డప్పూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ అర్జున్ తెలిపారు. ఆయా గ్రామాల్లో బుధ వారం ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్



ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికు వివిధ ప్రాంతాల నుండి 91 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. అందులో భూసమస్యల పై 30, పెన్షన్ కోసం 16, ఇతర విషయాల పై 45 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరి స్తామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలంటే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ పథకాలకు కావాల్సిన అర్హతలను బట్టి వారికి మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంట ఎన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, డిఆర్ఓ పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

నవతెలంగాణ -పాపన్నపేట



ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అన్నారు. పాపన్నపేట మండల పరిధిలోని గాంధారిపల్లిలో సోమవారం నిర్వహించిన నవగ్రహ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమనికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరిలో భక్తి భావన వెల్లివిరియాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ప్రతిష్ఠించిన నవగ్రహ విగ్రహాలకు ఎమ్మెల్సీతో వేద పండితులు పూజలు చేయించారు. అనంతరం హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ వెంకట్ రెడ్డి, నాయకులు మహిపాల్ రెడ్డి, శ్రీను నాయక్, తదితరులు ఉన్నారు.

18 ఏండ్లు నిండితే ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-మెదక్



01 ఏప్రిల్ 2024 నాటికి 18 ఏండ్ల వయస్సు నిండిన యువతి, యువకులు నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ప్రజలే ప్రభుత్వాలను ఏర్పాటు చేసే విధానంలో ఓటు హక్కు విలువైనదన్నారు. ఓటుతో దేశ భవిష్యత్తును మార్చుకోవాలని, ఓటు హక్కు ప్రజలందరికీ సమానంగా ఉంటుందన్నారు. నూతనంగా 18 ఏళ్లు నిండిన యువతి యువకులు తప్పని సరిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఫోరమ్ 6 ద్వారా నమోదు చేసుకున్న వారి ఓటును బిఎల్ఓ లు, బిఎల్ఓ సూపర్ వైజర్ల ద్వారా ఆన్లైన్ ప్రక్రియ వేగవంతం చేయించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు 01 ఏప్రిల్ 2024 నాటికీ 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు నూతన ఓటరుగా ఫారం 6 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన యువతి, యువకులు ఆన్లైన్ ద్వారా కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కలిగిస్తూ అధికారులు ప్రోత్సహించాలని కోరారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం బూత్ లెవల్ అధికారులకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. గ్రామాల వారీగా ఫామ్ 6 ను త్వరితగతిన ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని బిఎల్ఓ, బిఎల్ఓ సూపర్వైజర్ ద్వారా సమాచారం తెలుసుకోవాలన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నూతనంగా ఓటరునమోదు పై విస్తృత అవగాహన కలిగి ఉండాలన్నారు.



అధికారులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-పాపన్నపేట

గ్రామాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు అభివృద్ధికి కృషి చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. పాపన్నపేట ఐకేపీ భవనంలో ఎంపీపీ చందనా ప్రశాంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చేది వేసవి కాలం కావునా నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. గ్రామాలను ఎప్పటికపుడు పర్యవేక్షించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వం ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నదన్నారు.ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సభకు సమస్యలు విన్నవించారు. కొత్తపల్లి గ్రామ శివారులోని వంతెన వద్ద ఇరువైపులా తారు రోడ్డు లేకపోవటంతో దుమ్ము లేచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పాపన్నపేట ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ సభా దృష్టికి తీసుకువచ్చాడు. శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభలో చదివివినిపించారు. ఈ సందర్భంగా పొడ్చన్‌పల్లి గ్రామంలో పలువురు ఫోన్లు చేసి వేధింపులకు గురి చేస్తున్నారని ఆ గ్రామ ప్రత్యేకాధికారి వెంకటరమణమ్మ సభలో ఎమ్మెల్యే రోహిత్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఆయన స్పందించి అధైర్యపడవద్దని తాను అండగా ఉంటాననిభరోసా ఇచ్చారు. ఏ ఆపద ఉన్న తనను సంప్రదించాలన్నారు. అనంతరం ఆయన మల్లంపేటలో శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. గాంధారిపల్లిలో ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు, శానాయిపల్లిలో బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఎంపీడీఓ సుబ్రమణ్యం, కో ఆప్షన్ సభ్యుడు గౌస్, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్ గుప్త, ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, తదితరులున్నారు.

గాయపడిన వ్యక్తికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామానికి చెందిన బీజేపీ బూత్‌స్థాయి అధ్యక్షుడు దొమ్మాట రాజు కొన్ని రోజుల క్రితం యాక్సిడెంట్‌లో గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్.. రాజు యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని రూ.5000 ఆర్థిక సాయాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తను ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో గోపరి భరత్ కుమార్, పెంజర్ల ఎల్లం, జిపి స్వామి, కిసాన్ మోర్చా కల్వకుంట రాజేశ్వర్‌రెడ్డి, నీలం సంజీవ్ మాజీ ఉపసర్పంచ్ నార్లాపూర్, జాల పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.



సామూహిక శ్రీమంతాలు..

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో గల 3 అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలకు సోమవారం సామూహిక శ్రీమంతాలను జరిపించారు. చిన్నపిల్లలకు ఏ విటమిన్ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, ఏఎన్ఎం రమ్య, అంగన్వాడీ టీచర్లు అరుణ, శిరీష, విజయ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులకు శిక్ష తప్పదు

నవతెలంగాణ-వెల్దుర్తి



మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని.. ఒకవేళ ఎవరైనా ఇస్తే మాహన యజమానులకు శిక్ష తప్పదని వెల్దుర్తి ఎస్ఐ నవత గౌడ్ అన్నారు. మైనర్లు వాహనాలు తీసుకెళ్లి ప్రమాదాలు చేస్తే.. ఆ వాహన యజమానులకు ఐపిసి 304 కింద పదేండ్లు, 308 ఐపిసి కింద ఏడేండ్లు శిక్షారులు అవుతారన్నారు. కావున మైనర్లకు, లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరించారు. డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

జాతర ఉత్సవాల్లో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్



శివంపేట మండల పరిధిలోని పాంబండ, పిల్లుట్ల గ్రామాలలో జరుగుతున్న శ్రీ మల్లన్న జాతర ఉత్సవాల్లో సోమవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు సువాసిని రెడ్డి ,రాష్ట్ర నాయకులు కరుణాకర్ రెడ్డి, జిల్లా నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు రఘువ రెడ్డి, మైసయ్య యాదవ్, గణేష్, గౌరీ శంకర్, వెంకటేష్, శీను, భరత్, నాగేష్ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కంకర పోసిండ్రు... డాంబర్ మరచిండ్రు

- నస్కల్ వెళ్లాలంటే నరకయాతనే
- పట్టించుకోని అధికారులు
- సమస్య పరిష్కరించాలని ప్రజల వేడుకోలు



నవతెలంగాణ-నిజాంపేట

రోడ్డు నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు గానీ, కాంట్రాక్టర్ గానీ పనుల్లో వేగం పెంచడం లేదు. ఇలాంటి దుస్థితిలోనే నస్కల్ గ్రామ ప్రజలు నాలుగు నెలల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కంకర పోసి నాలుగు నెలలవుతున్నా.. నేటికీ పనులు పూర్తవలేదు. దాంతో ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ద్విచక్రవాహన దారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. నిజాంపేట మండల కేంద్రం నుంచి నస్కల్, రాంపూర్ నందగోకుల్, చల్మెడ కమాన్ వరకు రోడ్డు వేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి.. నిర్మాణ పనుల కోసం రూ.65 కోట్లు మంజూరు కూడా చేసింది. అయినప్పటికీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నేటికీ పనులు పూర్తి కాలేదు. నిజాంపేట మండల కేంద్రంలో నుంచి నస్కల్ వెళ్లే దారిలో కంకర పోసి దాదాపు 4 నెలలు అవుతున్నా.. డాంబర్ వేయలేదని దాంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నస్కల్ గ్రామానికి వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైక్‌లు స్కిడ్ అయి కిందపడడంతో పలువురికి గాయాలు కూడా అయ్యాయని చెబుతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి తమ ప్రాణాలు బలైపోతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్లు పనులు ఆలస్యంగా చేయుట ఏంటని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్అండ్‌బీ ఏఈని వివరణ కోరగా.. పనులు ఆలస్యంగా జరగడం మాట వాస్తవమేనన్నారు. 18 కిలోమీటర్ల పొడవు ఈ రోడ్డు పనులు జరుగుతున్నాయని.. ప్రస్తుతం చల్మెడ, నందగోకుల గ్రామాల మధ్య మట్టి పోయడం జరుగుతుందన్నారు. అది పూర్తికాగానే కంకరపోసి.. ఒకేసారి డాంబార్ పోసేలా కాంట్రాక్టర్ పనులు చేస్తున్నట్టు చెప్పారు.

కంకరపై వెంటనే డాంబర్ వేయాలి..



మండల కేంద్రం నుంచి నస్కల్ గ్రామానికి కంకర పోసిండ్రు. డాంబర్ పోయడం మరిచిండ్రు. దాదాపు నాలుగు నెలల నుంచి ఇదే పరిస్థితి. కంకర రోడ్డుపై వెళ్లాలంటే నరకయాతన అవుతున్నది. టైర్లు పగిలిపోతున్నాయి.. పంచర్లు అవుతున్నాయి. అధికారులు స్పందించి నస్కల్ రోడ్డులో పోసిన కంకరపై వెంటనే డాంబర్ పోయాలి.

– కన్నాపురం బాగాగౌడ్, నిజాంపేట వాసి

జీవనోపాధి కోల్పోయి.. ఎలా బతకాలి

నవతెలంగాణ-నార్సింగి



తమ కుటుంబాలు 70ఏండ్లుగా మండల కేంద్రంలోని మల్లన్నగుట్ట సర్వే నెంబర్ 620లో రాళ్లు కొట్టుకుంటూ బతుకుతున్నాయని.. ఇప్పుడు వద్దంటే తాము జీవనోపాధిని కోల్పోయి ఎలా బతకాలని మండల పరిధిలోని మల్లన్నగుట్ట వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ బాల స్వామిలను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ.. నార్సింగి మండల పరిధిలోని మల్లన్నగుట్టలో సర్వే నెంబర్ 620లో 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, తమ 40 కుటుంబాలు గత 70ఏండ్లుగా 2008 వరకు ప్రభుత్వానికి మైనింగ్ అధికారులు సూచించిన విధంగా చలానా రుసుము డీడీ చెల్లిస్తూ రాళ్లు కొడుతూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. అయితే 2009 నుంచి అధికారులు రుసుము తీసుకోవడం లేదని.. కానీ గత 20 రోజుల నుంచి మండల తహశీల్దార్, నార్సింగి పోలీసులు సర్వే నంబర్ 620 భూమిని పోలీసులకు భూమిని కేటాయించారని చెబుతూ తమను పనులు చేసుకోనివ్వడం లేదని వాపోయారు. రెక్కాడితే గానీ డొక్కాడని తమ కుటుంబాలు గత 20 రోజులుగా పనులు చేసుకోలేక, వేరే పనులు చేయడం రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సూచించిన విధంగా చలానా రుసుం చెల్లిస్తామని. తమకు ఆ భూమిలో రాళ్లు కొట్టుకోనివ్వాలని విజ్ఞప్తి చేశారు. తాము జీవనాధారం కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని, తమ బతుకులకు దారి చూపించాలని కోరుతూ కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. అధికారులు కూడా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, నిఖిల్, మల్లయ్య, యాదగిరి, నవీన్, స్వామి, రమేష్, రాజు, రాములు, నర్సింలు, కిషన్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



వాగునే మళ్లించే యత్నం

నవతెలంగాణ-టేక్మాల్



భూమిని కబ్జా చేయడానికి కొందరు రియల్టర్లు వాగునే పక్కకు మళ్లించే ప్రయత్నం చేశారు. వాగుకు అడ్డంగా మట్టిని పోసేందుకు ప్రయత్నిస్తుండగా యవకులు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని కాజులూరు నుంచి బొడుమెట్పల్లి గ్రామంలోని గుండు వాగుకు ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 163లో గల సుమారు ఎకరం భూమిని కొందరు వ్యక్తులు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని కబ్జా చేశారు. కబ్జాకు అడ్డుగా ఉన్న గుండు వాగును పక్కకు మళ్ళించే ప్రయత్నం చేస్తూ మట్టిని తరలించారు. యువకులు అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు సర్వే నంబర్ 163 పరిశీలించి.. గుండు వాగుకు అడ్డుగా పోస్తున్న మట్టిని తీసివేయాలని చెప్పారు. కానీ కబ్జాకు పాల్పడిన వారు మాత్రం అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ.. మట్టిని అక్కడినుంచి తొలగించలేదు.

నార్సింగిలో దొంగల బీభత్సం

- ఆదివారం రాత్రి ఒకేసారి మూడు ఇండ్లలో చోరీ
- రూ.28వేలు, వెండి వస్తువుల అపహరణ





నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకేరాత్రి మూడు ఇండ్లలో చోరీకి పాల్పడి నగదుతోపాటు, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

నార్సింగి మండల కేంద్రానికి చెందిన గోత్రాల శ్రీకాంత్, పంపరి జనార్దన్, బోడ భూపాల్ తమ ఇండ్లకు తాళం వేసి తమ సొంత పనులపై వేరే దగ్గరికి వెళ్లారు. ఇది గమనించిన దొంగలు.. తాళాలు పగులగొట్టి ఆ మూడు ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న రామాయంపేట సీఐ వెంకటేష్, నార్సింగి ఏఎస్సై శంకర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ను రప్పించి ఆధారాలను సేకరించారు. ఈ ఘటనలో రూ.28 వేల నగదు, వెండి వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లి నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. కాగా మండల కేంద్రంలో అడపాదడపా దొంగత నాలు జరుగుతున్నప్పటికీ ఆదివారం ఒకేసారి మూడు ఇళ్లను దోచుకోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు గస్తీ పెంచి దొంగతనాలను అరికట్టాలని కోరుతు న్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

నవతెలంగాణ-నార్సింగి



నార్సింగి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మహావీర్ ఇంటర్నేషనల్ (సికింద్రాబాద్) అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు కంప్యూటర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కంప్యూటర్ విద్య చాలా అవసరమన్నారు. అలాంటి విద్యార్థుల భవిత కోసం తమ సంస్థ తరపున పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేసినట్టు చెప్పారు. తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు రకాల సేవా కార్యక్ర మాలు చేస్తున్నా మన్నారు. అందులో భాగంగా పాఠశాలకు కంప్యూటర్‌లు అందజేయడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మహావీర్ ఇంటర్నేషనల్ సంస్థ తరపున బాదల్ జైన్, ప్రీతం, ఉత్సవ రణసారియా, రవి, వికాస్, రేష్మా రవి, రష్మి శ్రీనివాసన్ పాల్గొనగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మురళి మోహన్, ఎమ్ఎస్ఓ రామకృష్ణ, పీఈటి శ్రీధర్‌రెడ్డి,బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ- చిలిపిచెడ్



మండల పరిధిలోని అజ్జమర్రి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 5వ తరగతి విద్యార్థులు స్వయంగా ఉపాధ్యాయులుగా వ్యవహరించి.. తోటి విద్యార్థులకు బోధించారు. ఈ బోధనను ప్రధానోపాధ్యాయులు నరేష్, ఉపాధ్యాయులు వెంకట కృష్ణ, కనకయ్య, మదర్ లు పర్యవేక్షించారు. కాగా హెడ్మాస్టర్‌గా షకీరాబి, ఉపాధ్యాయులుగా స్పందన, మౌనిక, నందిని, పుష్పలత మధు, రాము, లక్ష్మణ్, శివ, శ్రీధర్, లక్ష్మి నారాయణ, అభినందు వ్యవహరించారు.

తిరుమల స్వామి ఆలయ హుండీ లెక్కింపు



నవతెలంగాణ-నిజాంపేట: మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో జరిగిన తిరుమల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ హుండీ లెక్కింపును ఆలయ కమిటీ చైర్మెన్, ఆలయ ఈవో సమక్షంలో చేపట్టారు. హుండీ ద్వారా రూ.1,48,712 ఆదాయం వచ్చినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రామ్ రెడ్డి, ఈవో మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ చొప్పెట ముత్యంరెడ్డి, కమిటీ డైరెక్టర్ బ్రహ్మచారి, రమేష్, కాకి రాజయ్య, తుమ్మల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు







నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని నర్సంపల్లిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి సందర్భంగా దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు శివాజీ వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివాజీ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారికి వివేకానంద యూత్ పూలబోకేతో ఘన స్వాగతం పలికింది. అనంతరం రఘునందన్‌రావు మాట్లాడుతూ.. హిందూ మతం, దేశ పరిరక్షణ కోసం పరాక్రమించిన మహనీయుడు, యోధుడు శివాజీ అని కొనియాడారు. యువత శివాజీని ఆదర్శంగా తీసుకుని, దేశానికి అవసరమైనప్పుడు దేశం కోసం నిలబడాలని పిలుపునిచ్చారు. నర్సంపల్లి యువతకు మంచి భవిష్యత్తు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబు, ఉపాధ్యక్షుడు శేఖర్, సభ్యులు అనిల్, ఉదయ్, రాజు, నవీన్, మహేష్, సతీష్, సాయిలు, శ్రీకాంత్, ప్రశాంత్, నవీన్, సందీప్, కనకరాజు, శేషు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట : మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ హాజరై శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఘన నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశాన మరాఠ సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యా న్ని ఎదిరించి మరాఠా వీరుడిగా పేరుగాంచిన భారతమాత ముద్దుబిడ్డ అని కొనియాడారు. స్త్రీని గౌరవించి హిందూ ధర్మానికి వన్నెతెచ్చిన వీరుడు అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మట బాబు, పంజా మహేందర్, చంద్రశేఖర్, సిద్ధరాంరెడ్డి, జాల పోచయ్య, జిపి స్వామి, మహేష్, తిరు పతి, సుధాకర్, తిరుమల గౌడ్, వెంకటేశం లక్ష్మణ్, బండారి ఎల్లం, పంజా బాబు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్ : మండల పరిధిలోని తంప్లూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శ్రీశ్రీ మహంత్ రాహుల్ దాస్ బాబా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ 394 జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అఖండ భారతావనిని ఏకతాటిపై తీసుకురావడం కోసం బహుజన రాజు పౌరుషాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన వీరుడు శివాజీ అని కొనియాడారు. శివాజీ జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శ ప్రాయం అన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత కొండ రమేష్, మాజీ సర్పంచ్ సంగ య్య, మాజీ ఎంపీటీసీ సంధ్యా రవిబాబు, నాయకులు బసం తరావు, కర్రి మల్లేశం, సతీష్ శేఖర్ నాగయ్య రమేష్, సాయిలు, సంతోష్, శివాజీ, యూత్ సభ్యులు ఉన్నారు.

మూడు నెలలుగా వేతనాల్లేక పనులు నిలిపివేస్తున్నాం



నవతెలంగాణ-మనోహరాబాద్

మూడు నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులను నిలిపివేస్తున్నట్టు గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం తూప్రాన్ మండల కార్యాలయంలో ఎంపీఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ.. ఉదయం 6 గంటలకు లేచి ఊరిని శుభ్రం చేస్తూ.. మురికి కాల్వలు తీస్తూ తమ ప్రాణాలను పణంగా పెట్టి.. ప్రజల ఆరోగ్యాలను కాపాతుంటే తమకు మూడు నెలలైనా వేతనాలు ఇవ్వకపోవడం ఎంతవరకు న్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోతే తమ కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని వాపోయాడు. అధికారులకు మాత్రం ఒకటవ తేదీన జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర బడ్జెట్ ఉంటుంది గానీ.. గ్రామపంచాయతీ కార్మికులకు ఇవ్వడానికి లేదా అని ప్రశ్నించారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని రేపు(బుధవారం) ఛలో కలెక్టర్ ఆఫీస్ చేపట్టి.. ధర్నా చేయనున్నట్టు చెప్పారు. ఈ ధర్నాలో జిల్లాలోని కార్మికులందరూ జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు మహేష్, ఉపాధ్యక్షులు శేఖర్, కార్యదర్శి వెంకటేష్, యాదగిరి, రాజు, స్వామి, బాలయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అర్జీదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతు....ప్రజావాణి కార్యక్రమం పై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. ఎంతో నమ్మకం తో జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలను విన్నవించుకునేందుకు ప్రజావాణి కి వస్తున్నారని, అంతే నమ్మకంగా అర్జిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించినచో వారికి న్యాయం చేసిన వాళ్లం అవుతామని జిల్లా అధికారులకు సూచించారు. ప్రజావాణి లో భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతర మొత్తం కలిపి 24 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో డిఆర్ఓ నాగ రాజమ్మ, డిఆర్డిఏ పిడి జయదేవ్ ఆర్యా, కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే దివ్యాంగులకు ప్రాధాన్యత



నవతెలంగాణ- దుబ్బాక
కేసీఆర్ హయాంలోనే దివ్యాంగులకు ప్రాధాన్యత లభించిందని వారికి రూ. 4016 పెన్షన్ ను అందించి కొండంత అండగా నిలిచాడని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సుమారు 20 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను మున్సిపల్ చైర్పర్సన్ వనిత భూమిరెడ్డి, ఎంపీపీ పుష్పలత కిషన్ రెడ్డి, జెడ్పీటీసీ రవీందర్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడి టీచర్లకు నూతన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, పీఏసీఎస్ చైర్మన్ షేర్ల కైలాష్, కౌన్సిలర్లు, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-దుబ్బాక
నియోజకవర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండలాల లబ్ధిదారులకు మంజూరైన 154 కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రేవంత్ సర్కార్ ఎమ్మెల్యేల ప్రోటోకాల్ విషయంలో స్పందించడం లేదని ఓడిపోయిన వారికి నిధులు ఇస్తున్నారని విమర్శించారు. గతంలో నిలిచిపోయిన కాల్వపనులు, రైతు, విద్యుత్ సమస్యలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వనిత భూమిరెడ్డి, ఎంపీపీ పుష్పలత కిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ కడతాల రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, ఎంఆర్ఓ నల్ల వెంకటరెడ్డి, ఆర్ ఐ నరసింహారెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మెన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వంటేరు



నవతెలంగాణ-గజ్వేల్
ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మణికొండ లక్ష్మీకాంతరావు జన్మదినం సందర్భంగా సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ల జీవించి గజ్వేల్ ప్రాంతానికి మరిన్ని సేవలు అందించాలని ఒంటేరు ప్రతాప్ రెడ్డి కోరారు.

మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ఔదార్యం

- అహ్మద్ నగర్ గ్రామానికి 200 ప్లాస్టిక్ కుర్చీల బహూకరణ



నవతెలంగాణ -దౌల్తాబాద్
మండలంలోని హైమద్‌నగర్ గ్రామానికి 200 కుర్చీలను మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ అందజేశారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ మండలం కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాట ప్రకారం 200 కుర్చీలను ఫారూఖ్ హుస్సేన్ పంపిణీ చేశారని తెలిపారు. సేవా గుణం కలిగిన ప్రతి ఒక్కరు సేవ చేయాలని ప్రజలలో గుర్తింపు తెచ్చుకోవాలని ధనం కన్నా గుణం ముఖ్యమని గత నెల రోజుల క్రితం అనారోగ్యానికి గురి అయినటువంటి ఎమ్మెల్సీ ఫారక్ హుస్సేన్ త్వరగా కోలుకొని ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, ఎంపీటీసీ తిరుపతి,రవి,మంజూర్, మసీదు పెద్దలు మోల్ సాబ్, పాషా,రఫీ,ఆలీ,పటాన్,ఆలీ, బషీర్, తదితరులు ఉన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య.. ప్రశాంతంగా శివాజీ జయంతి



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్
చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా అడిషనల్ డీసీపీ ఎస్ మల్లారెడ్డి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో జరిగినట్టుగా ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు వందమంది పోలీసులతో బందోబస్తు పటిష్టం చేశామని మల్లారెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీకి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ర్యాలీ గజ్వేల్ రామాలయం టెంపుల్ నుండి మార్కెట్ హనుమాన్ టెంపుల్, ఇందిరా పార్క్, బస్టాండ్, అంబేద్కర్ స్టాచ్, పిడిచెడు రోడ్డు నుంచి శివాజీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి బాలాజీ,సీఐ లు సైదా, మురళి, రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, తొగుట సిఐ లతీఫ్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

లచ్చపేటలో స్వయం పాలన దినోత్సవం



నవతెలంగాణ- దుబ్బాక
దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్క సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని దేశభవితను నిర్దేశించేది విద్యార్థులేన్నారు.

జోరుగా అక్రమ ఇసుక రవాణా

- ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



నవతెలంగాణ-మిరుదొడ్డి
జోరుగా అక్రమ ఇసుక రవాణా జరుగుతుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో గల నాగయ్య వాగు నుండి ఇసుక అక్రమంగా దొంగతనంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇసుక నింపి ఉన్న ట్రాలీ తో సహా మొగుళ్ళ కనకయ్యను పట్టుకొని కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై పరశురాం తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వారి పైన చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తప్పుడు మార్గంలో వెళితే చట్ట పరమైన చర్యలు తప్పవు అన్నారు.

వినాయక గుడి విగ్రహ ప్రతిష్ట



నవతెలంగాణ- గజ్వేల్
గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈనెల 26 నుండి 29 వరకు ప్రజ్ఞాపూర్ గ్రామంలో స్ప్రింగ్ ఫీల్డ్ ఇన్ఫో కాలనీలో వినాయకుని గుడి ప్రతిష్ఠకు రావాలని ప్రధాన అర్చకులు రాజు పంతులుకు ఆహ్వాన పత్రాన్ని అందించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, తోట లక్ష్మణ్, నరేందర్ రెడ్డి, కార్తీక్, మల్లేశం, రవి, కనకయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.

గౌరారం ఎస్ఐగా జె.శివకుమార్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-వర్గల్
గౌరారం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన జె. శివకుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధను కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించి శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు. రాబోవు ఎంపీ ఎలక్షన్లో సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు.

గజ్వేల్ ఏసీపీ బాలాజీని కలిసిన డిపో మేనేజర్



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్
నూతనంగా గజ్వేల్ ఏసిపి గా వచ్చిన ఏ. బాలాజీని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ బి. సురేఖ, అసిస్టెంట్ మేనేజర్ బాబు నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఏసీపీ ఆఫీస్‌లో పూల బొకే ఇచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏసీపీతో మాట్లాడుతూ శాంతిభద్రతల దృష్ట్యా లా అండ్ ఆర్డర్ పటిష్టం చేయడంలో ఎంతో నైపుణ్యం ఉన్న వ్యక్తిగా గుర్తింపు పొందారున్నారు. ఆర్టీసీకి అవసరమైన పోలీసు రక్షణ కల్పించాలని కోరగా, స్పందించిన ఏసిపి బాలాజీ ప్రతి ఒక్కరి సమస్యపై వెంటనే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కుకునూరుపల్లిలో శోభాయాత్ర

నవతెలంగాణ-కొండపాక
చత్రపతి శివాజీ జయంతి వేడుకలను కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కుకునూరుపల్లిలో చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ కాసం నవీన్ కుమార్ పాల్గొన్నారు. చత్రపతి శివాజీ యూత్ సభ్యులు, ఉమ్మడి కొండపాక మండల వాసవి క్లబ్ అధ్యక్షులు ఉప్పల రాజు పాల్గొన్నారు.

వనదేవతల జాతరకు సర్వం సిద్ధం

- దేవక్కపల్లిలో ప్రసిద్ధిగాంచిన సమ్మక్క-సారలమ్మ జాతర
- రేపటి నుండి 25 వరకు జాతర మహోత్సవాలు

నవతెలంగాణ-బెజ్జంకి
దేవక్కపల్లి గ్రామంలో రెండేండ్ల ఒకసారి నిర్వహించే అదివాసీ, గిరిజన వనదేవతలు సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహించే ఈ జాతరకు హాజరయ్యే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా సకల సౌకర్యాలను జాతర కమిటీ సభ్యులు ఏర్పాటుచేశారు. మోయతుమ్మెద వాగు పరిసర ప్రాంతంలో నిర్వహించనున్న ఈ జాతరకు సందర్శకులకు తాగునీరు, ప్రత్యేక స్నానఘట్టాలు ఏర్పాటుచేసి జాతర జరిగే స్థలాన్ని చదును చేయించారు. ఈ జాతరకు అయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై మొక్కలు చెల్లించుకుంటారు. జాతీయ రహదారి పక్కనే దేవక్కపల్లి గ్రామం ఉండటంతో భక్తులకు రవాణ సౌకర్యం అందుబాటులో ఉంది.



జాతర మహోత్సవం తీరు..
ఈ నెల 21న మధ్యాహ్నం దేవక్కపల్లి గ్రామం నుంచి వరాలిచ్చే వరాల కుండా, లక్ష్మి దేవి కుండా, ఏడాంత్రాల బోనం ఎత్తి గ్రామంలోని శివమెత్తిన భక్తుల పూనకాలతో డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా బయలుదేరి సాయంత్రం వరకు సమ్మక్క సారలమ్మ గద్దె వద్ద ప్రతిష్ఠిస్తారు. రాత్రి సమయంలో కంకవనం పూజరుల వేదమంత్రాలతో సారలమ్మను గ్రామ శివారులోని బందం చిలుకలగట్టు నుంచి గద్దెపైకి తీసుకువస్తారు. అదే రోజు పడిగిద్దె రాజును, గోవింద రాజును గద్దెలపైకి పూజారులు తీసుకువస్తారు. 22వ తేదీన ఉదయం సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. వనదేవతలు గద్దెలపై కొలువుదీరడంతో భక్తుల మొక్కులు చెల్లింపులు ప్రారంభమవుతాయి. 25న అదివారం సమ్మక్క, సారలమ్మ, పడిగిద్దె రాజు, గోవింద రాజు మళ్లీ వనప్రవేశం చేస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



దేవక్కపల్లి గ్రామంలో నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవాలకు జాతర నిర్వహణ కమిటీ అధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. తాగునీరు, స్నాన ఘట్టాలు, దర్శనానికి భారీకేడ్లు, వైద్యం, రవాణా సౌకర్యాలను కల్పించాం.

జంగిడి సంజీవ రెడ్డి, జాతర కమిటీ చైర్మెన్ దేవక్కపల్లి

గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రగల్బాలా..?

- తట్టెడు మట్టి తీయని వీరు అబద్ధాల ప్రచారం
- హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్ బాబు



నవతెలంగాణ-అక్కన్నపేట
అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు ఎమ్మెల్యే సతీష్ కుమార్ హయాంలోనే 90 శాతం పూర్తయిందని, నిర్వాసితులకు అందాల్సిన అన్ని పరిహారాలు అందించారని హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్ అన్నారు. సోమవారం గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై విలేకర్ల సమావేశం నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కాకుండా కేసులు వేస్తూ వచ్చింది కేవలం కాంగ్రెస్, బిజెపి అని ఆరోపించారు. వారి స్వలాభ్య రాజకీయాల వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో కేవలం శంకుస్థాపనకే పరిమితమైనటువంటి ప్రాజెక్టుకు రూపకల్పన తీసుకొచ్చింది సతీష్‌కుమార్ అని తెలియజేశారు. 1.4 టిఎంసిలు ఉన్నటువంటి ప్రాజెక్టును 8 టీఎంసీలు చేసిన ఘనత సతీష్ కుమార్ కే దక్కుతుందని అన్నారు. కక్షపూరితంగా కొంతమంది వ్యక్తులు ప్రాజెక్టుపై కేసులు వేస్తూ కాలయాపన చేస్తూ వచ్చారని, దీనివల్ల హుస్నాబాద్ నియోజకవర్గ రైతాంగం ఎంతో నష్టపోయారని ఆరోపించారు. ఇప్పటికే ప్రాజెక్టులోకి టిఎంసికి పైగా నీళు వచ్చాయని, ప్రాజెక్ట్ అంతా పూర్తయిందని, కేవలం కాలువల పనులే కొంత మేరకు మిగిలి ఉన్నాయని తెలియజేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీరందించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులు అనేవి రాజకీయ నాయకుల సొమ్ము కాదని, కేవలం రైతాంగం కోసమే నిర్మించబడేవి అని, అది ప్రజల సొమ్మని ప్రాజెక్టులపై దిక్కుమాలిన రాజకీయాలు చేయడం మానేసుకుని రైతులకు న్యాయం చేయాలని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పెసరి సాంబరాజు, మాజీ మార్కెట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసర్ల అశోక్ బాబు, గుగాటిపల్లి ఎంపీటీసీ బైరి రవి, కుందన్ వాణిపల్లి మాజీ సర్పంచ్ దినేష్ రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు చిట్యాల సంపత్, తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన స్టాఫ్ నర్స్‌లను విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్
- కలెక్టరేట్ ఎదుట సిఐటీయూ ధర్నా



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్
తొలగించిన ప్రభుత్వ హాస్పిటల్ ఔట్సోర్సింగ్ స్టాఫ్ నర్స్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు. సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి స్పందించి సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు అన్నారు. చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ... 2019 కరోనాకాలంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఔట్సోర్సింగ్ పద్ధతిలో 80 మందిని రిక్రూట్మెంట్ చేసుకున్నారని అప్పుడు వీరిని పర్మినెంట్ చేస్తామని హామీతో తీసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రభుత్వ హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ వేసి ఎగ్జామ్ నిర్వహిస్తే.. కొత్తగా వచ్చిన ప్రభుత్వం రిజల్ట్ ప్రకటించి మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు కానీ కరోనాకాలంలో ప్రాణాలు తెగించి ప్రజలకు సేవలు అందించిన ఔట్సోర్సింగ్ స్టాఫ్ నర్స్ లను రెగ్యులరైజ్ చేయకపోగా వీరిని విధుల నుండి తొలగించడం దారుణం అన్నారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ సూపరిండెంట్ ప్రభుత్వం ఆర్డర్ కాపీ ఇవ్వకుండా వీరిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నామంటూ వారి వ్యక్తిగత ఫోన్లకి మెసెజ్ పంపడం సరైందికాదన్నారు. ప్రభుత్వం ప్రకటన ఇచ్చేంతవరకు వీరి ఉద్యోగాలలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, సిఐటియు నాయకులు అమ్ములా బాల నర్సయ్య, శంకరయ్య, స్టాఫ్ నర్స్ సిబ్బంది సంపత్, తార, గీత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో 13 మంది విద్యార్థులకు మెడల్స్



నవతెలంగాణ-దుబ్బాక
రుద్రమదేవి షోతోఖాన్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగిన నాల్గవ రాష్ట్రస్థాయి కరాటే, కుంపు ఛాంపియన్షిప్ పోటీల్లో దుబ్బాక పట్టణానికి చెందిన 13 మంది విద్యార్థులు పలు మెడల్స్ సాధించినట్టు యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు స్టైల్ చీఫ్ మాస్టర్ బురని శ్రీకాంత్ తెలిపారు. ఈ కరాటే పోటీల్లో దుబ్బాక పట్టణానికి చెందిన 13 మంది విద్యార్థులు 3 గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్ మెడల్స్, 6 బ్రౌంజ్ మెడల్స్ సాధించారు అని మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్, బ్రౌంజ్ మెడల్స్ సాధించిన బాలికలను అలానే మాస్టర్ బురాని శ్రీకాంత్ ని రుద్రమదేవి మెగా కప్ తో రుద్రమదేవి షోతొకన్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ వారు అభినందించారు. దుబ్బాక బాలికల పాఠశాల విద్యార్థినీలు శ్రీజ -గోల్డ్ మెడల్, విజయ, ప్రజ్ఞ- సిల్వర్ మెడల్స్, సంజన, అఖిల, లక్షిత -బ్రౌంజ్ మెడల్స్, చెల్లాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రణవి, రమ్యశ్రీ -గోల్డ్ మెడల్స్, శ్రావణి, సుహని - సిల్వర్ మెడల్స్, స్పందన, అమూల్య, రుతిక -బ్రౌంజ్ మెడల్స్ సాధించినట్టు మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. అనంతరం పథకాలు సాధించిన విద్యార్థులను డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, జీఈసీ ఓ ముక్తేశ్వరి, మాస్టర్ బురాని శ్రీకాంత్, సురేందర్, దుబ్బాక బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, పీడీసౌందర్య, చెల్లాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, పీఈటీ నాగేందర్‌గౌడ్ పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-గజ్వేల్: చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు గజ్వేల్ పట్టణంలోని పిడిచెడు రోడ్డులో ఉన్న చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం పాల్గొన్నారు.

గజ్వేల్ : గజ్వేల్ పట్టణంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవంలో స్థానిక నాయకులతో కలిసి కాంగ్రెస్ నాయకులు నీల మధు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉత్సవ నిర్వాహకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ : మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ వంటేరు విజయవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజు, నర్సింలు, రజినీకాంత్, గణేష్, సాయి కృష్ణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోమటి చెరువు కట్ట నుండి విక్టరీ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, పటేల్ పురా, లాల్ కామన్, గాంధీ చౌక్, కాంచిట్, ఎక్బల్ మినార్, ముస్తాబాద్ చౌరస్తా మీదుగా నాగదేవత్ చౌరస్తాలోని శివాజీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పల్లె బాలకిషన్ గౌడ్, ఉపాధ్యక్షులు పల్లె భాస్కర్ గౌడ్, గంధం కరుణాకర్ రెడ్డి, కొలమాద్ది విజయసాగర్ గౌడ్, మెర్గు యాదగిరి గౌడ్, పిండి అరవింద్, నాయిని జైపాల్ రెడ్డి, కుంబాల పద్మారెడ్డి, జడేజా, అల్లం ఎల్లం, బుర్ర చంద్రం గౌడ్, కాన్గల్ గోపాల్ రెడ్డి, పాపగారి యాదగిరి గౌడ్, అంజి, మల్లేశం, శంకర్ పాల్గొన్నారు.

నంగునూరు : మండల కేంద్రంలో శివాజీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. శివాజీ పరిపాలన విధానాన్ని, హిందూ సామ్రాజ్య స్థాపనకు చేసిన కృషిని కొనియాడారు.కార్యక్రమంలో నాయకులు వల్లపు రెడ్డి రజనీకర్ రెడ్డి, చౌడుచెర్ల వెంకట్రామిరెడ్డి, చెలికాని యాదగిరి యాదవ్, శివ ప్రసాద్, జీడిపల్లి రజనీకర్ రెడ్డి, తుపాకుల శ్రీనివాస్, నరేష్, వేణు పాల్గొన్నారు

మర్కుక్ : భరతమాత ముద్దుబిడ్డ, మరాఠా సామ్రాజ్య స్థాపనకు కృషి చేసిన యోధుడు చత్రపతి శివాజీ అని మర్కుక్ జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి కొనియాడారు. సోమవారం చత్రపతి శివాజీ 394 జయంతి సందర్భంగా మండలంలోని చేబర్తి, ఎర్రవల్లి, పాములపర్తి, మర్కుక్, తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. చేబర్తిలో శివాజీ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్,గుప్తా,ఆశోకా,స్వామి, బబ్బూరి రాములు గౌడ్,వెంకట్ రెడ్డి, తుమ్మ కష్ణ,తాండ బాలకష్ణ,సతీష్ గౌడ్,సంజీవరెడ్డి, బాపురెడ్డి, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొండపాక: కొండపాక మండలం దుద్దెడ శివారులో టోల్‌గేట్ సమీపంలో తొగుటకు వెళ్లే రోడ్డు చౌరస్తాలో దుద్దెడ ఆరె క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని సోమవారం సంఘం అధ్యక్షులు, దుద్దెడ ఎంపీటీసీ బాలాజీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో దుద్దెడ మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహాదేవగౌడ్, రవీంద్ర నగర్ విశ్వనాథ్ పల్లి మాజీ సర్పంచ్ వాసవి లింగారావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్, నాయకులు బూర్గుల సురేందర్ రావు, కొండ్ర రవీందర్ , ముత్యాల విష్ణు, ఆరె క్షత్రియ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్: చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని సబ్బుబిళ్ల మీద శివాజీ చిత్రాన్ని అద్భుతంగా చిత్రించి సోమవారం ఘన నివాళులు అర్పించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి భారతీయుని గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానుభావుడు చత్రపతి శివాజీ అన్నారు.

మద్దూరు: మద్దూరు మండల కేంద్రంలో శివాజీ జయంతి వేడుకలను రామాలయ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం శివాజీ చిత్రపటంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

బెజ్జంకి: శౌర్యానికి మారుపేరుగా మరాఠా సామ్రాజ్య చక్రవర్తి చత్రపతి శివాజీ ప్రతీకగా నిలిచాడని..అయనను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని శంబు సురేందర్ అన్నారు.మండల కేంద్రానికి అనుబంధ గ్రామమైన పాపన్నపల్లిలో స్థానికుడు శంబు సురేందర్ తన తండ్రి జ్ఞాపకార్థం నిర్మించిన నూతన శివాజీ విగ్రహన్ని సోమవారం ఆరె క్షత్రియ సంఘం నాయకులు అవిష్కరించారు. అంతకుముందు మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం వద్ద అయన జయంతి వేడుకలను ఆరె క్షత్రియ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు.

తొగుట: ప్రతి పౌరుడు శివాజీ జీవన విధానాన్ని అలవర్చుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దోమల కొమురయ్య అన్నారు. సోమవారం మండలం లోని కాన్గల్ గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన శివాజీ యూత్ సభ్యులను అభినందించి గ్రామ, మండల ప్రజలకు దోమల కొమురయ్య ఛత్రపతి శివాజీ జయంతి శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాదారంప్రశాంత్, లింగుపల్లిబాలరాజ్, పోతురాజు యాదగిరి, కాముని స్వామి, తరిగొప్పుల స్వామి, శివాజీ, సభ్యులు, చరణ్, మనోజ్, నర్సింలు, సాయి, రామ్, వంశీ, రంజిత్, గౌతం, నవీన్, శ్రీనాథ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



















దుబ్బాక కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా గొర్రె మహేందర్ రెడ్డి నియామకం



నవతెలంగాణ- రాయపోల్

దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా రాయపోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన గొర్రె మహేందర్ రెడ్డిని నియమించినట్టు సేవాదళ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గొర్రె మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజక వర్గం సేవాదళ్ జనరల్ సెక్రెటరీ గా నియమించినందుకు సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దేల జితేందర్ రెడ్డి కి, డిసిసి ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి కి సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు హనుమండ్లకాడి కిష్టారెడ్డి కి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ కి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానన్నారు.

నూతన గృహ ప్రవేశం చేసిన మాజీ సర్పంచ్‌కు..

- శుభాకాంక్షలు తెలిపిన దుబ్బాక ఎమ్మెల్యే



నవతెలంగాణ-తొగుట

నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని మాజీ సర్పంచ్ దంపతులకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ సిరినేని గోవర్ధన్ రెడ్డి సిద్దిపేటలో నూతన గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని గోవర్ధన్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎండీ కలీమోద్దీన్, ఎంపీటీసీ వేల్పుల స్వామి, నాయకులు బుర్ర నర్సింహులు, నరేందర్ గౌడ్, మోహినోద్దీన్ తదితరులు ఉన్నారు.

జిన్నారం యువతకు జాతీయ అవార్డులు



నవతెలంగాణ-జిన్నారం

సామాజిక చైతన్య పూరిత కార్యక్రమాల ద్వారా ప్రజా చైతన్యం కోసం కషి చేస్తున్న జిన్నారం మండలానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్, గొల్లగూడ శారదలను వల్లూరి ఫౌండేషన్ జాతీయ అవార్డులతో సత్కరించింది. ఈ మేరకు హైదరాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో జిన్నారానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్‌కు గద్దర్ జాతీయ పురస్కారం, స్వామి వివేకానంద ప్రగతి రత్న పురస్కారం, గొల్లగూడ శారదకు సావిత్రిబాయి పూలే పురస్కారాన్ని వారు అందజేశారు. అవార్డులు అందుకున్న శ్రీనివాస్ శారదలు కతజ్ఞతలు తెలిపారు.

బురుగుపల్లి కెనాల్ నుండి సాగు నీరు విడుదల



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం బూరుగుపల్లి కెనాల్ నుండి సాగునీరు విడుదల చేసినట్లు గ్రామ మాజీ సర్పంచ్ వంటేరు విజయవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామంలో రైతుల కోరిక మేరకు సాగులూరు రైతుల కోరిక మేరకు సాగునీరు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. కెనాల్ వద్ద ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు. గ్రామంలో మాజీ సర్పంచ్ సొంత డబ్బులతో 10 హెచ్పిబోర్ మోటార్‌ను దాదాపు లక్షా 30 వేల ఖర్చు చేసి రైతులకు అందించారు. దీని ద్వారా నీటిని ఎత్తిపోశారు.

తహసీల్దార్ రాకపోవడంతో ప్రజల ఇక్కట్లు





నవతెలంగాణ-కొండపాక

నాలుగు రోజులుగా కొండపాక తహసీల్దార్ విధులకు హాజరు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొండపాక తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాస్.. గజ్వేల్ తహసీల్దార్‌గా బదిలీ కావడంతో ఆయన గురువారం అక్కడ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన స్థానంలో బదిలీ అయిన బాలరాజు ఇప్పటివరకు బాధ్యతలు తీసుకోలేదు. అప్పటినుంచి కార్యాలయంలో తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు వివిధ పనులపై వస్తూ చేసేది ఏమీ లేక తిరిగి వెళ్తున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారితో పాటు ఇతరత్ర పనుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారు.

రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మెన్‌ను కలసిన మొద్దిన్ అహ్మద్



నవతెలంగాణ - సిద్దిపేట

రాష్ట్ర వాక్ఫ్ బోర్డు చైర్మెన్‌గా నియమితులయిన అజ్మతుల్లా హుస్సేన్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్టు టీపీసీసీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు కలీం మొద్దిన్ అహ్మద్ తెలిపారు. కాగా, ఈనెల 21న నాంపల్లి హజ్ హౌస్ గ్రౌండ్‌లో రాష్ట్ర వాక్ఫ్ బోర్డు చైర్మెన్‌గా నియమితులయిన అజ్మతుల్లా హుస్సేన్ పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు.

మాత్‌పల్లిలో ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ



నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లి మండలం మాత్‌పల్లి గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠతో పాటు శివలింగ, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమ వారం ఘనంగా జరిగాయి. శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ మహో త్సవాలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ మహిపాల్, ఎంపీటీసీల ఫోరమ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ డైరెక్టర్ కోళ్ల సద్గుణ రవీందర్ ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు.

దౌల్తాబాద్‌లో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-దౌల్తాబాద్

దౌల్తాబాద్ లోని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక శివాజీ చౌరస్తాలో శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మదంశెట్టి ఆనంద్, సిలివేరి కనకరాములు, జిర్కపల్లి ఆంజనేయులు, మొద్దురాజు, అది మహేష్, పోచయ్య, సతీష్, స్వామి, నరేష్, హనుమంత్, కర్ణాకర్ రెడ్డి, నాగరాజు, హరీష్, శ్రీకాంత్, సురేష్, కార్తిక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నాలుగోరోజు ఉత్సాహంగా దర్గా జాతర



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని పీర్ గైబ్ సాహెబ్ దర్గా జాతర నాలుగోరోజు కూడా అంగరంగ వైభవంగా కొన సాగింది. నాలుగో రోజు జాతరలో రెండు రోజు పశువుల సంతను నిర్వహిం చగా.. సమీప గ్రామాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పశువులను జాతరకు తోలుకువచ్చారు. ఎంతో అందంగా అలంకరించిన పశువులతో అంగడి మొత్తం కిక్కిరిసిపోయింది. మరోపక్క భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్గాలో మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో నేడు(మంగళవారం) జరిగే కుస్తీ పోటీలకు ఎంతో ప్రత్యేకత ఉన్నది. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కుస్తీ పోటీలను తిలకించాలని ఉత్సవ కమిటీ విజ్ఞప్తి చేశారు. ఈ కుస్తీ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల పైల్వాన్లు తలపడనున్నారు.



రైతుల దీక్షకు మద్దతుగా జేపసీ ర్యాలీ

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

రైతుల న్యాయపరమైన కోరికలను నెరవేర్చాలని ఢిల్లీలో జరుగుతున్న రైతుల దీక్షకు మద్దతుగా హుస్నాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం మల్లె చెట్టు చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) నియోజకవర్గ చైర్మెన్ కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతులను ఇబ్బందులకు గురిచే యడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారితో చర్చలు జరిపి, వారి న్యాయపరమైన డిమాండ్లను తీర్చడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి కేడం లింగమూర్తి, జేఏసీ కోఆర్డినేటర్ మేక ల వీరన్న యాదవ్, కో కన్వీనర్ ముక్కెర సంపత్ కుమార్, వడ్డేపల్లి మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు, పచ్చిమట్ల రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో నైతిక విజయం నాదే

- పల్లా రాజేశ్వర్ రెడ్డి నాపై దొంగ ఓట్లతో గెలిచారు
- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి
- కాంగ్రెస్ కండువా కప్పుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ నరేందర్



నవతెలంగాణ-చేర్యాల

అసెంబ్లీ ఎన్నికల్లో నైతిక విజయం తనదేనని, పల్లా రాజేశ్వర్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మెన్ ఆడెపు చంద్రయ్య తన కుమారులు చేర్యాల మున్సిపల్ 5వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆడేపు నరేందర్, ఆడెపు మహేష్‌తో పాటు గ్రంథాలయం మాజీ చైర్మెన్ నాగుల వెంకటేశం సుమారు 200 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. జనగామ నియోజకవర్గంలో సుమారు 18 వేల ఓట్లు ముక్కు ముఖం తెలియని వారిని నమోదు చేయించి దొంగ ఓట్లతో గెలుపొంది ఈ రోజు నియోజకవర్గంలో ఎమ్మెల్యేనని తిరగడం సిగ్గుచేటన్నారు. దొంగ ఓట్లతో గెలిచినట్టు నిరూపిస్తానని, చర్చకు సిద్ధమా అని రాజేశ్వర్ రెడ్డికి ప్రతాప్ రెడ్డి సవాల్ విసిరారు. పదవులున్నా.. లేకున్నా ప్రజల కొరకు నిరంతర సేవ చేస్తామని, నియోజకవర్గానికి అన్ని రకాలుగా నిధులు తెచ్చి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

పదేండ్ల కిందట కాంగ్రెస్‌లో ఉన్న తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ అక్రమంగా కేసులు, బెదిరింపులకు గురి చేయడంతో ఆ పార్టీలో చేరామని కౌన్సిలర్ ఆడెపు నరేందర్ తెలిపారు. బీఆర్ఎస్ లో చేరినప్పటి నుండి నా కుటుంబానికి సముచిత స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ పార్టీ ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాలు, అప్పటి ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు వార్డు ప్రజలకు వెన్నంటి ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించానన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు మంచాల చిరంజీవులు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బనుక శివరాజ్, నాయకులు మంజ మల్లేశం, కర్క సంతోష్ రెడ్డి, పుర్మ ఆగం రెడ్డి, ముస్త్యాల యాదగిరి, కొమ్ము రవి, మహిపాల్ రెడ్డి, దాసరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



విశిష్ట సేవలకు ప్రతిభా పురస్కారం..

నవతెలంగాణ-బెజ్జంకి

సామాజిక కార్యక్రమాలు ఏర్పాటుచేసి ప్రజలకు అందించిన విశిష్ట సేవలకు ఉత్తమ ప్రతిభ పురస్కారాలు దక్కాయి. 2022-23 ఏడాదిలో బాధ్యతలు నిర్వర్తించిన లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులకు ఈ గౌరవం దక్కింది. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బెజ్జంకి లయన్స్ క్లబ్‌కు ఉత్తమ ప్రతిభ పురస్కారాలు వరించాయి. ఉత్తమ అధ్యక్షుడిగా ఎలు కరవీంద్ర ప్రసాద్,ఉత్తమ కార్యదర్శిగా రాజ్ పురోహిత్ భరత్ సింగ్, ఉత్తమ కోశాధికారిగా బండి వేణు,ఉత్తమ కోర్ కమిటీ సభ్య లుగా నారెడ్డి సుదర్శన్ రెడ్డి,పుల్లూరీ ప్రభాకర్ ఉత్తమ ప్రతిభ పురస్కారాలు అందుకున్నారు.బెజ్జంకి లయన్స్ క్లబ్ గత 16 ఏండ్లుగా విశిష్ట సేవలందిస్తూ ఉత్తమ లయన్స్ క్లబ్ పురస్కారాలు వరించడం అభినందనీయమని ఎలుక రవీంద్ర ప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు.

పంచాయతీల నిధులు సద్వినియోగం చేసుకోండి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

గ్రామ పంచాయతీల నిధులను సద్వి నియోగం చేసు కుని.. గ్రామాలని అభివృద్ధి పథంలో ముందుకు నడపాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మనూరు, నాగలిగిద్ద, నారాయణఖేడ్ మండ లాల పరిధిలోని స్పెషల్ ఆఫీసర్లతో సోమవారం రివ్యూ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు నియమించబడ్డ స్పెషల్ ఆఫీసర్లు, గ్రామపంచాయతీ కార్య దర్శులు ప్రతినిత్యం గ్రామాభివృద్ధి కోసం కషి చేయా లన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల కేటాయిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్, ఎస్డీ ఎఫ్ నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో మౌలిక వసతి కల్పనకు పాటుపడాలన్నారు. అదేవి ధంగా గ్రామా ల్లోని డంప్‌యార్డులో తడి, పొడి చెత్త వేరు చేయాల న్నారు. గ్రంథాలయల నిర్వహణ తదితర అభివద్ధి పనుల కోసం దాతలను సంప్రది ంచాలన్నారు. పంచాయతీలో రివిజిన్ రిజి స్టర్‌ను ఏర్పాటుచేసి సమస్యలను పొందుపరిచి పరిష్కార దిశగా పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వాధికారులు, కార్యదర్శులు స్పెషల్ ఆఫీ సర్లు, ఎంపీపీ తనయుడు కర్ర రమేష్ చౌహన్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల దరిచేరని 'ఉపాధి'

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

వలసలను నివారించి ఉన్న ఊళ్ళో ఎటువంటి నైపుణ్యం లేని మాన్యువల్ పనిచేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వయోజనులందరికీ 100 రోజుల పనిని అందించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డీప స్వామి డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ మండలం బూరగుపల్లి గ్రామంలో ఉపాధి పని జరుగుతున్న పని ప్రదేశాలకు వెళ్లి కూలీల స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి భద్రత పెంపొందించడమే లక్ష్యంగా ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. కానీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో రోజురోజుకు కూలీల నుంచి ఉపాధి దూరంగా నెట్టివేయబడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని గజ్వేల్, కొండపాక, వర్గల్, ములుగు, జగదేవ్‌పూర్, తూప్రాన్ మండలాల్లోని 146 గ్రామపంచాయతీల్లో 36,177 యాక్టివ్ జాబ్ కార్డులకు గాను 62,200 మంది కూలీలు ఉన్నారని తెలిపారు. వారిలో ఈ ఏడాది కేవలం 725 కుటుంబాలు మాత్రమే 100 రోజుల పనిదినాలు పూర్తి చేసినట్టు చెప్పారు. పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, పనిముట్లు లేకపోవడం, పనిచేసిన 15 రోజుల్లో వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనిలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్, ఆధార్ బెసిడ్ వేతనాలు తదితర అంశాలు జోడించడం వల్ల కూలీలు ఉపాధికి దూరమవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పని చేసే ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలని డిమాండ్ చేశారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

బీడీ కార్మికులందరికీ పెరిగిన కరువు భత్యం (వీడీఏ) అమలు చేయాలని రాష్ట్ర బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంచె నర్సింలు డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేటలో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులకు కరువు భత్యం పెరిగిందన్నారు. వినిమయ ధరల సూచి 1696 నుంచి 1809 పాయింట్లకి పెరిగిందని తెలిపారు. 1994 అగ్రిమెంట్ ప్రకారం పాయింటుకు 10 పైసల చొప్పున, పెరిగిన 113 పాయింట్లుకు.. రూ.11.30 పైసలు పెరిగిందన్నారు.బీడీలు చుట్టే కార్మికులకు 1000 బీడీలకు కరువు భత్యం(వీడీఏ) 11.30 పైసలుకు పెరిగి రూ.245.08 పైసలు అవుతుందన్నారు. ఈ పెరుగుదల 2024 ఏప్రిల్ 01 నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. నెలసరి జీతాల ఉద్యోగులైన బీడీ చెకర్స్, బట్టి కార్మికులు, టేబుల్ క్లర్క్స్, వాచ్‌మెన్‌లకు నెలకు రూ.339 చొప్పున పెరిగిన జీతాన్ని ఏప్రిల్ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 7 లక్షల మందికి పెరిగిన కరువు భత్యం వల్ల ప్రయోజనం కలుగుతుందని అన్నారు. పెరిగిన కరువు భత్యం ప్రభుత్వం అమలు చేసేలా పోరాడాలని బీడీ కార్మికులందరికీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బీడీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శోభన్, ఉపాధ్యక్షులు సిద్దేశ్వర్, బీడీ టేకేదారుల సంఘం జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాముని మల్లేశం పాల్గొన్నారు.

వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-మర్కుక్

వరి పంటలో మోగి పురుగు నివారణకు తగిన సస్య రక్షణా చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి టి. నాగేందర్ రెడ్డి తెలిపారు. సోమ వారం మర్కుక్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరిపైర్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరిలో మోగి పురుగు నివారణకు నారు నాటిన 10 నుంచి 15 రోజుల మధ్యలో కార్బాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 4 కిలోలు లేదా ఫ్లూబెండమైడ్ గుళికలు 5 కిలోలు లేదా పిప్రోనిల్ 6 కిలోలు, 10 కిలోల ఇసుకలో కలిపి తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. వరిపైర్లు గంధక దుష్ప్రభావం వలన తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఒకే పొలంలో సంవత్సరాల తరబడి వరి సాగుచేయడం వల్ల వరిలో సల్ఫైడ్ దుష్ప్రభావం వస్తుందన్నారు. దానివల్ల 30-50 శాతం వరకు పంట దిగుబడి తగ్గుతుందన్నారు. ఇను ము ధాతువు లోపం ఉండే పొలాల్లో అలాగే బరువు నేలల్లో సల్ఫైడ్ కలిగిన 20-0-0-13 లాంటి కాంప్లెక్సులను అధికంగా వాడటం లేదా సింగిల్ సూపర్ ఫాస్పేట్‌ని గాని లేదా అమ్మోనియం సల్ఫైడ్‌ని ఎక్కు వగా వాడటం వలన ఈ దుష్ప్రభావం వస్తుందన్నారు. సాధారణంగా చెరువులు, కాలువలు, నీటి పారుదల ఎల్లప్పుడూ ఉండే పొలాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దీని వల్ల అక్కడక్కడ గుం పులు గుంపులుగా బాగా పెరిగిన పంట మొత్తం పసుపు రంగులోకి మారి ఎదుగుదల క్షీణిస్తుందన్నారు. పొలంలోకి దిగి గమనించినట్లయితే మట్టి మెత్తగా ఉండి కాలు లోతుగా దిగబడిపోతుందని, మట్టి నుంచి కుళ్ళిన వాసన వస్తుందని, పొలంలో నడుస్తున్నప్పుడు బుడగల రూపంలో గాలి బయటకు వస్తుందని, వేర్లు పూర్తిగా నల్లగా మారి జీవం కోల్పోయి కుళ్ళిన వాసన వస్తుందని చెప్పారు. దీని నివారణకు పైరు వేయటానికి ముందు 1-2 బండ్ల ఎర్ర మట్టిని తోలి భూమిని బాగా ఆరబెట్టి, ఎత్తు వంపులు లేకుం డా సమానంగా ఉండే విధంగా పొలాన్ని తయారు చేసుకో వాలని సూచించారు. నీరు ఎక్కువగా నిలువ ఉంటే ఈ సల్ఫైడ్ దుష్ప్రభావం వస్తుందన్నారు. లీటర్ నీటికి ప్రోపినెబ్ 3గ్రాములు లేదా 2 గ్రా కార్బెండజిమ్, మంకోజెబ్, 10గ్రాల 19.19.19, 3గ్రాల ఫార్ములా 4 మిశ్రమాన్ని కలిపి పిచికారి చేయాలని తలిపారు. పరిశీలించిన వారిలో వ్యవసాయ విస్తరణ అధికారి రజినీ కాంత్, విష్ణువర్ధన్, రైతులు తదితరులున్నారు.

ఆయిల్ ఫామ్ పంటలపై అడవి పందుల దాడి



నవతెలంగాణ-ఝరాసంగం

మండలంలోని కుప్పానగర్ గ్రామంలో అడవి పందులు పంటలపై దాడి చేస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దాడికి గురైన మొక్కలను మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన చంద్రమ్మ దాదాపు ఐదు ఎకరాల పొలంలో ఆయిల్ ఫామ్ పంట సాగు చేస్తున్నదన్నారు. ఎకరాకు 57 మొక్కల చొప్పున సుమారు 285 మొక్కలు నాటినట్టు తెలిపారు. గత రెండు మూడు రోజుల నుండి అడవి పందులు దాడి చేసి.. సుమారు 70 మొక్కలను పూర్తిగా నాశనం చేశాయని మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అడవి పందుల దాడితో ఇపుడు మొక్కలను కొనడానికి ఇద్దరు వ్యక్తుల ఖర్చులు కలిపి సుమారు రూ.30,000 వరకు అవుతుందని వాపోయారు. అడవి పందుల నుంచి రక్షణ కోసం రూ.20,000 ఖర్చు పెట్టి చుట్టూ సోలార్, శబ్దం కోసం రెండు మైకులు పెట్టి తీసుకొచ్చిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఆర్టికల్చర్ అధికారులు, జంతు సంరక్షణ అధికారులు, అడవి పందుల నుండి రక్షణ కల్పించి, తమని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

దళితుడిని దూషించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



నవతెలంగాణ-హత్నూర

దళితుడిని గుడిలోకి రావదొద్దంటూ.. కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన అగ్రకుల వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పి.అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేవీపీఎస్ నాయకులు మంగాపూర్ గ్రామంలో గల బాధితుడి ఇంటికెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. మండలంలోని మంగాపూర్ గ్రామా నికి చెందిన మల్లేశం అనే దళితుడు మూడ్రోజుల క్రితం దౌల్తాబాద్‌లో జరిగిన జాతరలో పాల్గొనందుకు వెళ్లాడన్నారు. అయితే అక్కడ మల్లేశంను గుడిలోకి రావద్దంటూ దౌల్తాబాద్‌కు చెందిన కొందరు అగ్రకుల వ్యక్తులు అడ్డుకుని.. కులం తక్కువ వాడివి గుడిలోకి ఎందుకు వచ్చావురా అంటూ అసభ్య పదజాలంతో దూషించారన్నారు. అంతే కాకుండా రాత్రి సమయంలో గుడిలో నుంచి బయటకు లాక్కొస్తూ పిడిగుద్దులు గుద్దుతూ కింద పడేసి తొక్కుతూ దాడి చేశారని బాధితుడు తమతో వాపోయాడన్నారు. మల్లేశంపై కులం పేరుతో దూషించి దాడి చేసిన అగ్రకుల వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అశోక్ డిమాండ్ చేశారు. బాధితుడు మల్లేశంకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. ఈ కార్యక్ర మంలో కేవీపీఎస్ మండల కన్వీనర్ శేఖర్, నాయకులు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల తహసీల్దార్‌గా సమీర్ అహ్మద్ ఖాన్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల తహసీల్దార్‌గా సమీర్ అహ్మద్ ఖాన్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జోగినిపల్లి రాజేశ్వర్ రావు సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో తహసీల్దార్‌గా పనిచేసిన సమీర్ అహ్మద్ ఖాన్ చేర్యాలకు బదిలీపై వచ్చారు.



ముదిరాజ్‌ల హక్కుల సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-గజ్వేల్

ముదిరాజుల హక్కుల సాధనకు కృషి చేయాలని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గజ్వేల్ ముదిరాజ్ సంఘం నాయకులు నీలం మధుని కోరారు. బీసీ కుల గణనను స్వాగతిస్తూ.. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నీలం మధుకు సోమవారం గజ్వేల్ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లారెడ్డి గార్డెన్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా నీలం మధును ఘనంగా సత్కరించారు. ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా ముదిరాజ్ సామాజిక తరగతికి న్యాయం జరగట్లేదని వాపోయారు. ముదిరాజ్‌లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లోకి మార్చాలని కోరారు. ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. ముదిరాజ్ సామాజిక తరగతి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేసే దిశగా పాలన కొనసాగిస్తుందని తెలిపారు. బీసీ కుల గణన పూర్తయితే జనాభా దామాషా ప్రకారం న్యాయం జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ముదిరాజులందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, రాష్ట్ర కో కన్వీనర్ జగన్ ముదిరాజ్, నాయకులు గుంటుక శ్రీనివాస్, గొడుగు స్వామి, తలారి బిక్షపతి, డాక్టర్ లింగ సత్యనారాయణ, రాగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్దచెరువు కట్టపై గల సాయిబాబా దేవాలయం ఎనిమిదో వార్షికోత్సవంలో శ్రీ సాయిబాబా ప్రసదలయ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ నరసింహ గౌడ్, కౌన్సిలర్ కష్ణ, బోయిని బాలమణి బాలరాజ్,మంజుల ప్రమోద్ రెడ్డి, బిజిలి రాజు, కొల్లూరి చంద్రకళ గోపాల్, మాధవ రెడ్డి, కొల్లూరి మల్లేష్ ,కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, యునుస్, చౌటకూరి మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ యువత పెద్ద ఎత్తున పాల్గొని శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి.. ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాటా డుతూ.. మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మచ్చలేని వ్యక్తిత్వంతో మతసామరస్యంతో.. స్త్రీలను గౌరవించి ప్రజా పాలన సాగించిన ధీశాలి ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అజయ్, శేఖర్, రాజశేఖర్, మణిదీప్, అరవింద్, ప్రవీణ్, భరత్, శ్రీకాంత్, హరి ప్రసాద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.